




సభలో చంద్రబాబు అభివాదం

విజయం మనదే!

విల్లును ఎక్కుపెట్టిన చంద్రబాబు



- రాబోయేది టీడీపీ, జనసేన ప్రభుత్వమే
- వైసీపీ అరాచకాలకు ప్రజలు ముగింపు పలకడం ఖాయం
- కాకినాడ జిల్లాను పారిశ్రామికంగా, పర్యాటకంగా అభివృద్ధి చేస్తా
- ఏలేరు ఆధునికీకరణ, పురుషోత్తపట్నంతోపాటు ఎత్తిపోతల పథకాలను బాగుచేస్తా
- తునిలో రా..కదలిరా బహిరంగ సభలో టీడీపీ అధినేత చంద్రబాబు
- జిల్లాలో వైసీపీ ఎమ్మెల్యేలు ద్వారంపూడి, కన్నబాబు, దాడిశెట్టి రాజా అవినీతిపై ధ్వజం
- మంచితనానికి, మర్యాదలకు తూర్పుగోదావరి పెట్టింది పేరని కొనియాడిన చంద్రబాబు
- తుని సభకు వేలల్లో జనం పోటెత్తడంతో చంద్రబాబు ఉబ్బితబ్బిబ్బు

"వైసీపీ అరాచకాలతో ప్రజలు విసుగెత్తిపోయారు. ఆ పార్టీకి బుద్ధి చెప్పడానికి ఎప్పుడు ఎన్నికలు వస్తాయా అని ఎదురుచూస్తున్నారు. రాబోయేది టీడీపీ, జనసేన ప్రభుత్వమే" అని టీడీపీ అధినేత చంద్రబాబు ధీమా వ్యక్తం చేశారు. జిల్లాను పారిశ్రామికంగా, పర్యాటకంగా అభివృద్ధి చేసి పూర్వవైభవం తెచ్చే బాధ్యత తాను తీసుకుంటానన్నారు. తునిలో బుధవారం నిర్వహించిన రా..కదలి రా!.. సభలో పాల్గొని చంద్రబాబు గంటన్నరసేపు ప్రసంగించారు. సాయత్రం 4.15 గంటలకు హెలీకాఫ్టర్‌లో తునికి చేరుకున్న చంద్రబాబు 5.15 గంటలకు సభా వేదికపైకి వచ్చారు. అప్పటికే వేలల్లో హాజరైన జనాన్ని చూసి ఉబ్బితబ్బిబ్బయ్యారు. జన సందోహాన్ని చూస్తుంటే టీడీపీ గెలుపు కనిపిస్తోందన్నారు. చెంతనే ఉన్న సముద్రం పొంగిందా అన్న తరహాలో వచ్చిన జనాలను చూస్తే చాలా ఆనందంగా ఉందన్నారు. ఈ సందర్భంగా తూర్పుగోదావరి జిల్లా గొప్పదనాన్ని చంద్రబాబు వివరించారు. తూర్పుగోదావరి జిల్లా అంటే మంచితనానికి, మర్యాదలకు పెట్టింది పేరు అని కొనియాడారు. అలాగే వైసీపీ నేతల అరాచకాలను మరోసారి ఆయన ఎండగట్టారు. జిల్లాలో ప్రజలందరికీ సంక్రాంతి శుభాకాంక్షలు చెప్పిన చంద్రబాబు.. సంప్రదాయాలకు చిహ్నమైన కోడి పందాలకు ఏర్పాట్లు సిద్ధమయ్యాయని, అయితే హద్దుల్లో ఉంటూనే ఆడుకోవాలని సరదాగా సూచించారు.


బాబుకు స్వాగతం పలుకుతున్న వంగలపూడి అనిత, యనమల, రాజప్ప


బహిరంగ సభలో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న చంద్రబాబు


సభలో బొకే అందిస్తున్న కాకినాడ మాజీ మేయర్ సుంకర పావని


సభలో చంద్రబాబుతో రాజేష్ మహాసేన, మాజీ ఎమ్మెల్సీ చిక్కాల


చంద్రబాబుకు పూలమాల వేస్తున్న యనమల దివ్య, శివరామకృష్ణన్

కాకినాడ(ఆంధ్రజ్యోతి)/తుని రూరల్, జనవరి 10 :

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ముగ్గురు ఎమ్మెల్యేలకు, ఓ మంత్రికి సీట్లు మార్చిన జగన్.. కాకినాడ సిటీ, కొత్తపేట, అనపర్తి ఎమ్మెల్యేలను ఎందుకు మార్చరని చంద్రబాబు ధ్వజమెత్తారు. మంత్రి దాడిశెట్టి రాజా, ఎమ్మెల్యేలు ద్వారంపూడి, కన్నబాబుల అవినీతిపై విరుచుకుపడ్డారు. బుధవారం తునిలో నిర్వహించిన రా..కదలి రా..! సభకు వేలల్లో జనం హాజరవడంతో అంతా పసుపుమయం అయింది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా తరలివచ్చిన నేతలు, కార్యకర్తలతో పండగ వాతావరణం సంతరించుకుంది. సాయంత్రం 5.15కు చంద్రబాబు బహిరంగ సభ వేదికపైకి రాగానే చప్పట్లు, కేరింతలతో టీడీపీ, జనసేన నేతలు, కేడర్ స్వాగతం పలికారు. వేలల్లో హాజరైన జనాలను చూసిన చంద్రబాబు ఆప్యాయతలకు జిల్లా మారుపేరు అని కొనియాడారు. నీతినిజాయితీకి జిల్లా పెట్టింది పేరన్నారు. పౌరుషంగా ఒక్కమాట కూడా మాట్లాడరని అన్నారు. మంచినీళ్లు ఇస్తే కొబ్బరి నీళ్లు ఇక్కడి ప్రజలు ఇస్తారన్నారు. చెంతనే అన్నవరంలో నిత్యం పూజలు, వ్రతాలతో ఈ ప్రాంతం మార్మోగుతుందని వివరించారు. వైసీపీ పాలనతో ప్రజలు విసిగిపోయారని, మంత్రి దాడిశెట్టి రాజా అక్రమాల రాజా అని ధ్వజమెత్తారు. అక్రమ సంపాదనతో ఒకచోట 132 ఎకరాలు, మరోచోట రౌతులపూడిలో 72 ఎకరాలు కొన్నారన్నారు. ఇలాంటి వసూలు రాజా అయిన మంత్రి రాజా ఎందుకు టిక్కెట్ మార్పే విషయంలో కనబడలేదని జగన్‌ను ప్రశ్నించారు. మరో ఎమ్మెల్యే ద్వారంపూడి అవినీతికి ద్వారాలు తెరిచారని, దందాల్లో ఈయన హీరో అని ఆగ్రహం వ్యక్తం చేశారు. పవన్‌ను నోటికివచ్చినట్టు తిట్టడంలో ద్వారంపూడి మీరిపోయాడన్నారు. ఇలాంటి నేతలు తిన్నదంతా తిరిగి కక్కిస్తానని హెచ్చరించారు. జగన్‌కు ద్వారంపూడి బినామీ అని, బియ్యంలో ఈయన కోట్లు గడించారన్నారు. జిల్లాలో ఏ అవినీతి జరిగినా దీనికి కేంద్ర బిందువు ద్వారంపూడేనన్నారు. ఎమ్మెల్యే కన్నబాబు మెక్కడంలో స్పీడ్‌గా ఉన్నారని, ఒకప్పుడు ఈయన జగన్‌ను తిట్టిన తిట్టు తిట్టకుండా తిట్టి ఇప్పుడు తెగ పొడుగుతున్నారన్నారు. బతకనేర్చిన కన్నబాబు అవినీతిలో లెక్కలేనంతగా సంపాదించాడని ఆరోపించారు. జగ్గంపేట, ప్రత్తిపాడు, పిఠాపురం ఎమ్మెల్యేలను జగన్ మార్చేశారని, ఓ మంత్రిని జిల్లా దాటించేశారన్నారు. ప్రజలు కూడా సీఎం జగన్‌ను ఇంటికి పంపించడం ఖాయం అన్నారు. వైసీపీ పాలనలో జిల్లా సాగునీటి రంగం తీవ్రంగా దెబ్బతిందని ధ్వజమెత్తారు. టీడీపీ వచ్చాక ఏలేరు ఆధునికీకరణ, పురుషోత్తపట్నం, ఎత్తిపోతల పథకాలను తిరిగి గాడినపెడతామని ప్రకటించారు. జిల్లాలో సముద్రజల కాలుష్యంపై మత్స్యకారులు ఫిర్యాదుచేశారని, ఆ సమస్య పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. జిల్లాలో తీరంతోపాటు సెజ్, రెండు పోర్టులు ఉన్నాయని, పెట్రోకాంప్లెక్స్ కూడా వస్తే పారిశ్రామికంగా వృద్ధి చెందుతుందన్నారు. పర్యాటకరంగాన్ని కూడా ప్రోత్సహించి జిల్లాకు పూర్వవైభవం తెస్తానన్నారు. కాగా చంద్రబాబుకు టీడీపీ నేతలు వెండి గద, బాణం అందించారు. కార్యక్రమంలో మాజీ మంత్రులు యనమల రామకృష్ణుడు, బండారు సత్యనారాయణ, రాజప్ప, గొల్లపల్లి, ఎమ్మెల్యే గోరంట్ల, మాజీ ఎమ్మెల్యేలు నెహ్రూ, వనమాడి, వర్మ, రామకృష్ణారెడ్డి, వంగలపూడి అనిత, బండారు సత్యానందం, దాట్ల బుచ్చిబాబు, పిల్లి అనంతలక్ష్మి, జిల్లా పార్టీ అధ్యక్షుడు నవీన్, ప్రత్తిపాడు, తుని, రాజానగరం ఇన్‌చార్జులు వరుపుల సత్యప్రభ, దివ్య, బొడ్డు వెంకటరమణ, మాజీ ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు, అమలాపురం నియోజకవర్గ పరిశీలకుడు ముదునూరి మురళీకృష్ణంరాజు, మండలి మాజీ డిప్యూటీ చైర్మన్ రెడ్డి సుబ్రహ్మణ్యం, కటకంశెట్టి బాబి, పేరాబత్తుల రాజశేఖర్, వాసిరెడ్డి ఏసు దాసు, టీడీపీ సీనియర్ నేత గుణ్ణం చంద్రమౌళిలు పాల్గొన్నారు.

మూడు నెలల్లో దశ, దిశ చూపిస్తాం

సూర్యుడు తూర్పున ఉదయించి ఏ విధంగా అందరికీ వెలుగునిస్తాడో.. అలా టీడీపీ, జనసేన కూడా మూడు నెలల్లో ప్రభుత్వ బాధ్యత తీసుకుని దశ, దిశ చూపిస్తామని చంద్రబాబు స్పష్టంచేశారు. ఒక విజనరీ ఉండాలి. ఆ రోజుల్లో కాటన్.. ధవళేశ్వరం బ్యారేజీ కట్టాడు. అతడు విదేశీయుడైనా గోదావరి జిలాల్లో ఏ మూలకు వెళ్లినా ఆయన విగ్రహాలు పెట్టారు. అదీ మీ మంచితనం. మీకు మేలు చేస్తే అలా చూసుకుంటారు. కానీ ఇక్కడ వైసీపీ నేతలు మెక్కిందంతా కక్కిస్తామని టీడీపీ అధినేత చంద్రబాబు హెచ్చరించారు. కాగా జగన్ ప్రతిపక్షంలో ఉండగా ఇచ్చిన మోసపూరిత హామీల వీడియోను సభా వేదికపై భారీ స్ర్కీన్‌పై చంద్రబాబు ప్రదర్శించారు. మద్య నిషేధం చేస్తానని, సీపీఎస్ వారంలోనే రద్దు చేస్తానని, ప్రత్యేక హోదా తీసుకువస్తానని, పోలవరం 2021, 2022, 2023, 2025కల్లా పూర్తిచేస్తానని జగన్ ప్రసంగాలను ప్రదర్శించి.. బాబు ప్రశ్నల వర్షం కురిపించారు. జై చంద్రబాబు, జై పవన్‌కల్యాణ్.. సైకో పోవాలి సైకిల్ రావాలంటూ సభా ప్రాంగణం నినాదాలతో హోరెత్తింది. బాబు ప్రసంగానికి కార్యకర్తలు ఉత్సాహంతో స్పందించారు.





తునిలో జరిగిన రా.. కదలి రా..! బహిరంగ సభకు హాజరైన అశేష జనావళి.. సభలో వేదికపై మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు, మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు, నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జులు, ఇతర నేతలు ఉన్న దృశ్యం

రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో వెనక్కి నెట్టిన జగన్

వైసీపీ పాలనలో రాష్ట్రం అన్ని రంగాల్లో వెనుకబడి ఉంది. టీడీపీ పాలనలో దేశంలో రాష్ట్రం అభివృద్ధి మొదటి 5 స్థానాల్లో ఉండగా వైసీపీలో చివరి 5 స్థానాల్లోకి దిగజారింది. రాష్ట్రంలో ఎన్ని ఇబ్బందులు ఉన్నా సంపదను సృష్టించి రాష్ట్రాన్ని గాడినపెట్టగల సమర్థుడు చంద్రబాబు. భవిష్యత్ తరాలకు టీడీపీ, జనసేన ప్రభుత్వం ఎంతో అవసరం.

- యనమల రామకృష్ణుడు, రాష్ట్ర పొలిట్ బ్యూరో సభ్యుడు



బటన్‌నొక్కి జగన్‌ను ఇంటికి పంపిద్దాం

జనాలను మోసం చేస్తున్న జగన్‌ను ఈవీఎం బటన్ నొక్కి ఇంటికి పంపిద్దాం. రాష్ట్ర ప్రజలు టీడీపీ, జనసేన విజయాన్ని కోరుకుంటున్నారు. ఇరుపార్టీల మైత్రితో ఘన విజయం సాధిస్తాం.

- నిమ్మకాయల చినరాజప్ప, పెద్దాపురం ఎమ్మెల్యే

జనసేన, టీడీపీ సంయుక్త పోరాటం

జనసేన, టీడీపీ సంయుక్త పోరాటంతోనే వైసీపీ ఓటమి సాధ్యం. 45 వసంతాల రాజకీయ చరిత్ర.. ఉమ్మడి రాష్ట్రంలో సుదీర్ఘకాలం సీఎంగా పనిచేసిన చంద్రబాబుకు, మంచి స్టార్డమ్ ఉన్న జనసేన అధ్యక్షుడు పవన్‌కల్యాణ్‌లకు పదవులు ముఖ్యంకాదు.. రాష్ట్ర ప్రజల సంక్షేమం, శ్రేయస్సు కోసమే ఇరుపార్టీలు ఒక్కటయ్యాయి. రాష్ట్ర సైకో పాలనను అంతం చేసేందుకు చంద్రబాబు, పవన్ కలయిక తప్పనిసరి. రాష్ట్ర భవిష్యత్ కోసమే జనసేన అధినేత పొత్తు పెట్టుకున్నారు. ఇరుపార్టీలు సమన్వయంతో పనిచేసి సుపరిపాలనకు నాంది పలుకుదాం.

- కందుల దుర్గేష్, ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా జనసేన ఇన్‌చార్జి

జిల్లా వైసీపీలో గందరగోళం

- తానేటి వనితకు డౌట్?
- తాడేపల్లి వెళ్లిన మద్దతుదారులు
- జిల్లాలో అధికారికంగా ఇద్దరే ఖరారు
- మిగతా వారిని ఇంకా ప్రకటించకపోవడంతో అనుమానాలు
- కొవ్వూరులో వైసీపీలో రెండు వర్గాలు
- పార్టీ గ్రూపులో ఒకరిపై ఒకరు ఆరోపణలు
- ఆమె గోపాలపురం నేతలతో టచ్‌లో ఉన్నట్టు ప్రచారం
- సీఎం క్యాంపు ఆఫీస్‌కు జక్కంపూడి వెళ్లడంపైనా చర్చ

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

జిల్లా వైసీపీలో తీవ్ర గందరగోళం నెలకొంది. రాష్ట్ర హోంమంత్రి తానేటి వనిత టికెట్‌కు ఒక వర్గం చెక్ పెడుతుందనే అనుమానంతో బుధవారం ఆమె మద్దతుదారులు తాడేపల్లి పెద్దల వద్ద తేల్చుకోవడానికి వెళ్లారు. కానీ సాయంకాలం వరకూ ఏమీ తేలలేదు. జిల్లాలో ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలు, ఒక లోక్‌సభ నియోజకవర్గమూ ఉన్న సంగతి తెలిసిందే. ఇప్పటికే రాజమహేంద్రవరం రూరల్ నుంచి రాష్ట్ర మంత్రి చెల్లుబోయిన వేణు పేరును, రాజమహేంద్రవరం అర్బన్ నుంచి ఎంపీ మార్గానిభరత్ పేరును ఖరారు చేసిన సంగతి తెలిసిందే. వారేమో అసంతృప్తులతోనూ, అసమ్మతివర్గంతోనూ ఎలా గట్టెక్కాలని, అవకాశాలను కోల్పోయినా సిటీ, రూరల్ కోఆర్డినేటర్లు గుడూరి శ్రీనివాసరావు, చందన నాగేశ్వర్‌ను ఎలా బుజ్జగించాలో ఆలోచిస్తూ తమ ప్రచారం చేసుకుంటున్నారు. పైకి అంతా బాగానే ఉన్నా, లోలోపల వర్గాలు కుతకుతలాడిపోతున్నారు. ఇక కొందరికి వెళ్లి పనిచేసుకోమని చెప్పారే కానీ, అధికారికంగా ఇంకా ప్రకటించలేదు. అనపర్తి, రాజానగరం, కొవ్వూరు, గోపాలపురం, నిడదవోలు అభ్యర్థులను ఇంకా అధికారికంగా ప్రకటించలేదు. ఈ పరిస్థితుల్లో కొందరిలో టెన్షన్ మొదలైంది. వైసీపీ అధినేత జగన్ వైఖరి చూస్తుంటే ఏక్షణంలో ఎవరిని ఎక్కడ పోటీ పెడతారో, ఎవరి స్థానానికి ఎవరు పెడతారో అర్థం కాకుండా పోయింది. ఈ భయం కొందరి నేతల్లో ఊపిరాడకుండా చేస్తోంది. ప్రస్తుతం రాష్ట్ర హోంశాఖ మంత్రి తానేటి వనిత పరిస్థితి ఇలానే ఉంది. జిల్లాలో రెండోసారి కూడా ఆమెకు మంత్రి పదవి లభించింది. జగన్‌కు ఆమె సన్నిహితంగా ఉంటారనే ప్రచారం ఉన్నా ఇవాళ భయానికి లోనవుతున్నట్టు అర్థమవుతోంది. ఆమెకు మద్దతుగా బుధవారం కొంతమంది తాడేపల్లి వెళ్లారు. మిథున్‌రెడ్డితో మంతనాలు జరిపారు. కానీ స్పష్టత లేదు. పైగా ఈ నియోజకవర్గం వైసీపీ వాట్సప్ గ్రూపులో తీవ్ర వాగ్వాదాలు జరుగుతున్నట్టు మెసేజ్‌లు బయటకు వచ్చాయి. వనితమ్మకే మళ్లీ టికెట్ అని, ఆమెను గెలిపిస్తామని కొందరు, ఆమెకు మళ్లీ సీటు రాకుండా కుట్ర జరుగుతోందని కొందరు, ఒక సామాజికవర్గం ఆమెను రెండోసారి రానీయకుండా ప్రయత్నిస్తుందని మరికొందరు రకరకాలుగా వాదించుకుంటున్నారు. ఇటీవల వనిత గోపాలపురం వైసీపీ నేతలతో మాట్లాడుతూ తాను గోపాలపురం వస్తున్నానని చెప్పారని, ముందు ఆమె ఎక్కడ పోటీ చేద్దామనుకుంటున్నారో తేల్చుకోమని కొందరు ప్రశ్నిస్తున్నారు. ఇక్కడ సామాజిక వర్గాలు ఆధిపత్యపోరు కూడా నడుస్తోంది. అసలు ఆమెకు మళ్లీ టికెట్ ఇస్తారా, ఇస్తే ఎక్కడి నుంచి పోటీ చేస్తారనేది అయోమయంగా ఉంది. మంత్రి వనితకు మద్దతుగా బుధవారం కొందరు నేతలు తాడేపల్లి వెళ్లగా మంత్రి మాత్రం కొవ్వూరులోనే ఉన్నారు. మరోవైపు బుధవారం రాత్రికే కొందరి జాబితా ప్రకటిస్తారనే ప్రచారం జరిగింది. పండగ వెళ్లేవరకూ ఈ జాబితా ప్రకటన వాయిదా వేసినట్టు సమాచారం. దీంతో మరింత టెన్షన్ తప్పదు. కాగా రాజానగరం ఎమ్మెల్యే జక్కంపూడి రాజా బుధవారం సీఎం క్యాంపు ఆఫీసుకు వెళ్లారనే సమాచారం తాజాగా చర్చనీయాంశంగా మారింది. ఇక రాజమహేంద్రవరం వైసీపీ అభ్యర్థి విషయంలో కూడా అయోమయం నెలకొంది. ఎంపీ మార్గాని భరత్‌ను రాజమహేంద్రవరం సిటీకి పంపడంతో ఈ స్థానం ఖాళీ అయింది. ఇప్పటికే పలువురు బీసీ నేతలు తమకే ఈ స్థానం కేటాయించారని చెప్పుకుంటున్నారు. బీసీలలో డాక్టర్ అనుసూరి పద్మలత, విద్యావేత్త బర్ల విజయ్ యాదవ్, డాక్టర్ గూడూరి శ్రీనివాస్‌లు ఇప్పటికే అధిష్ఠానాన్ని కలిసినట్టు ప్రచారం జరుగుతోంది. జనరల్ కేటగిరీ నుంచి సినీ దర్శకుడు వీవీ వినాయక్ పేరు.. ప్రభుత్వ సలహాదారు రాజీవ్‌కృష్ణ పేరు కూడా పరిశీలనలో ఉన్నట్టు చెబుతున్నారు.



ఆర్‌డీ కార్యాలయం వద్ద ఆర్‌డీకి వినతిపత్రం అందిస్తున్న నాయకులు

సమ్మె విషయంలో ప్రభుత్వం పంతాలు మానుకోవాలి

ఆర్‌డీ కార్యాలయాన్ని ముట్టడిలో ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు

రాజమహేంద్రవరం సిటీ, జనవరి10: మునిసిపల్ కార్మికుల సమ్మె విషయంలో ప్రభుత్వం తన పంతాన్ని మానుకుని సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు రావులపల్లి రవీంద్రనాథ్ అన్నారు. రాజమహేంద్రవరంలో బుధవారం మునిసిపల్ కార్మిక జేఏసీ ఆధ్వర్యంలో మునిసిపల్ ఆర్‌డీ కార్యాలయాన్ని కార్మికులు ముట్టడించారు. దీనిలో పాల్గొని రవీంద్రనాథ్ మాట్లాడుతూ గత 9 రోజులుగా రాష్ట్రవ్యాప్తంగా కార్మికులు సమ్మె చేస్తున్నా ప్రభుత్వంలో చలనం లేకపోవడం దారుణమన్నారు. ముఖ్యమంతి జగన్ తన పంతాన్ని వీడితే మంచిదన్నారు. సమస్యలు పరిష్కరించకపోతే మునిసిపల్ కార్మికులంటే ఏమిటో చూపిస్తారన్నారు. వచ్చే ఎన్నికల్లో ఓటు అనే ఆయుధంతో బుద్ధిచెప్పడానికి అందరు సిద్దంగా ఉన్నారని చెప్పారు. మునిసిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు నెక్కింటి సుబ్బారావు మాట్లాడుతూ చలో ఆర్‌డి కార్యాలయానికి ఉదయం నుంచి నాలుగు జిల్లాల నుంచి మునిసిపల్ కార్మికులు ఆధ్వర్యంలో కార్మికులు పెద్దఎత్తున తరలివచ్చారని చెప్పారు. అనంతరం ఆర్‌డీకి వినతిపత్రం అందించారు. యూనియన్ నేతలు భజంత్రీ శ్రీనివాస్, తడికొండ వాసు, కె మల్లేశ్వరరావు, జిల్లా గౌరవ అధ్యక్షుడు తాటిపాక మధు, ఏఐటీయూసీ నేతలు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.


రౌండు టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న కందుల దుర్గేష్

అంగన్వాడీల సమస్యలు పరిష్కరించాలి

రౌండు టేబుల్ సమావేశంలో నాయకులు డిమాండ్

రాజమహేంద్రవరం అర్బన్, జనవరి 10: అంగన్వాడీల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని పలు రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాలు, ఉపాధ్యాయ, దళిత సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం రాజమహేంద్రవరం సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట అంగన్వాడీల నిరవధిక సమ్మె శిబిరంలో రాజకీయపార్టీలు, కార్మిక, ఉద్యోగ సంఘాలు, ప్రజాసంఘాల రౌండు టేబుల్ సమావేశం జరిగింది. సీపీఎం నగర కార్యదర్శి బి.పవన్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడు కందుల దుర్గేష్ మాట్లాడుతూ ఎన్నికలకు ముందు జగన్మోహనరెడ్డి ఇచ్చిన హామీలు అమలుచేయాలని అంగన్వాడీలు కోరుతుంటే వారిపై నిర్బంధం ప్రయోగించడం విడ్డూరంగా ఉందని అన్నారు. అంగన్వాడీల పోరాటానికి జనసేన పార్టీ సంపూర్ణ మద్దతు తెలుపుతున్నదని పేర్కొన్నారు. తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు ఆదిరెడ్డి అప్పారావు మాట్లాడుతూ అక్క చెల్లెమ్మలంటూ ఓట్లు దండుకున్న జగన్‌కు రాష్ట్రంలో 30 రోజులుగా సమ్మె చేస్తూ రోడ్ల మీద పోరాటాలు చేస్తున్న అంగన్వాడీలు కనబడలేదా అని ప్రశ్నించారు. ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా కోశాధికారి ఎం.వెంకటలక్ష్మీ, కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి దేవత సుధాకర్, సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు జువ్వల రాంబాబు, సీపీఐఎంఎల్ న్యూ డెమాక్రసీ జిల్లా నాయకులు జోజి, సీపీఐ రాజమహేంద్రవరం నగర కార్యదర్శి వి.కొండలరావు పాల్గొన్నారు.

తునిలో టీడీపీ ప్రభంజనం

- రా కదలిరా సభకు తండోపతండాలుగా జనం
- మధ్యాహ్నం 12 గంటల నుంచే బాబు కోసం ఎదురుచూపులు

తుని రూరల్, జనవరి 10: తునిలో టీడీపీ 'రా కదలిరా' సభ సూపర్ సక్సెస్ అయ్యింది. పార్టీ శ్రేణులు, అభిమానులు తండోపతండాలుగా తరలిరావడంతో నాయకుల ఆనందానికి అవధుల్లేవు. ఊహించని విధంగా జనప్రవాహం పోటెత్తడంతో తెగ సంబరపడిపోతున్నారు. సభా ప్రాంగణమంతా పసుపు మయంగా మారింది. మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు పిలుపు అందుకున్న కార్యకర్తలు ఉప్పెనలా తరలివచ్చారు. మధ్యాహ్నం 12 గంటల నుంచే చంద్రబాబు ప్రసంగం కోసం ప్రజలు వేసి ఉండటం విశేషం. ఎక్కడ చూసినా పసుపు బ్యానర్లు, పసుపు తోరణాలు ఆకర్షించాయి. సభా వేదికకు కార్యకర్తలు తరలివచ్చే ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన టీడీపీ పార్టీ ఆర్చ్‌లు ఆకట్టుకున్నాయి. చామవరం శివారు ఏర్పాటు చేసిన హెలిప్యాడ్ నుంచి రోడ్డు మార్గం గుండా చంద్రబాబు సభాస్థలికి చేరుకునే మార్గంలో వేలాదిగా తరలివచ్చిన ప్రజలకు చంద్రబాబు అభివాదం చేస్తూ ముందుకు కదిలారు. టీడీపీ ఇన్‌చార్జ్ యనమల దివ్య, జిల్లా తెలుగు యువత అధ్యక్షుడు యనమల శివరామకృష్ణన్ గజమాలతో స్వాగతం పలికారు. ఆయన సభా వేదికకు చేరగానే ఈలలు, కేకలు, చప్పట్లతో పరిసరాలు మారుమోగాయి. మాజీ మంత్రి అయ్యన్నపాత్రుడు కుమారుడు చింతకాయల విజయ్ చంద్రబాబుకు ధనస్సు బహూకరించగా, రాజమండ్రికి చెందిన మీసాల రాజు గదను అందజేశారు.

వైసీపీని గద్దె దించేందుకు సిద్ధం కావాలి

యనమల దివ్య, తుని టీడీపీ ఇన్‌చార్జ్

వైసీపీని గద్దె దించేందుకు ప్రజలు సిద్ధంగా ఉండాలని తుని టీడీపీ ఇన్‌చార్జి యనమల దివ్య తెలిపారు. కాకినాడ పార్లమెంట్ పరిధిలో 'రా కదలిరా' సభ రెట్టించిన ఉత్సాహం నింపినట్లు చెప్పారు. టీడీపీ, జనసేన ప్రభుత్వం ఏర్పడితే బీసీలకు రక్షణ చట్టం, మహిళలకు సూపర్ సిక్స్ పథకాలు అమలవుతాయని, పేద, మధ్యతరగతి ప్రజల జీవితాల్లో జనసేన, టీడీపీ ప్రభుత్వం వెలుగులు నింపుతుందన్నారు.



వేదికపై చంద్రబాబు, నాయకులు

సాగునీటి కాలువలు నిర్వీర్యం అయ్యాయి

ఎస్వీఎస్ఎన్ వర్మ, పిఠాపురం ఇన్‌చార్జి

సైకో జగన్ పాలనలో సాగునీటి కాలువలు నిర్వీర్యం అయ్యాయని ఫలితంగా రైతులు దెబ్బతిన్నారని వర్మ ధ్వజమెత్తారు. చంద్రబాబు పాలనలో రూ.1650 కోట్లతో పురుషోత్తపట్నం ప్రాజెక్టు అందుబాటులోకి తీసుకొస్తే వైసీపీ ప్రభుత్వం దాని నిర్వహణ చూడలేని పరిస్థితిలో ఉందన్నారు. రైతులు అమ్ముకున్న ధాన్యానికి డబ్బులు ఇవ్వలేక తుఫాన్ ప్రభావంతో నష్టపోయిన రైతులను ఆదుకోక రైతులు రోడ్డున పడే పరిస్థితి దాపురించిందన్నారు.

కౌరవ సభను గౌరవంగా మార్చాలి

జ్యోతుల నవీన్‌కుమార్, జిల్లా టీడీపీ అధ్యక్షుడు

రాష్ట్రంలో సైకో పాలన నడుస్తుందని ప్రజల కోసం అవమానాలు, నిర్బంధాలు భరించి ప్రజా శ్రేయస్సు కోసం తపిస్తున్న చంద్రబాబుకు అండగా నిలుద్దామని జిల్లా టీడీపీ అధ్యక్షుడు జ్యోతుల నవీన్‌కుమార్ తెలిపారు. రాష్ట్రంలో సైకో పాలన ఉందని, అసెంబ్లీ కౌరవసభను తలపిస్తుందని దీన్ని గౌరవ సభగా మార్చేందుకు కాకినాడ పార్లమెంట్ పరిధిలో 7 నియోజకవర్గాల్లో టీడీపీ అభ్యర్థులను అఖండ మెజార్టీతో గెలిపించుకుందామని తెలిపారు.

అరాచక పాలనకు కాలం చెల్లింది

యనమల కృష్ణుడు, రాష్ట్ర టీడీపీ ఆర్గనైజింగ్ సెక్రటరీ

అవినీతి అక్రమాలు, అరాచకాలతో పేట్రేగిపోతున్న వైసీపీ పాలనకు కాలం చెల్లిందని రాష్ట్ర టీడీపీ ఆర్గనైజింగ్ సెక్రటరీ యనమల కృష్ణుడు తెలిపారు. రాష్ట్రంలో అన్ని వర్గాలను మోసం చేసింది వైసీపీ ప్రభుత్వమేనని, అభివృద్ధి సంక్షేమం చంద్రబాబుతోనే సాధ్యమని భావితరాల భవిష్యత్ టీడీపీ, జనసేనతో ముడిపడి ఉందన్నారు.

అడ్డగోలు హామీలతో రాష్ట్ర ప్రజలకు అష్టకష్టాలు

వనమాడి కొండబాబు,కాకినాడ సిటీ టీడీపీ ఇన్‌చార్జ్

అడ్డగోలు హామీలతో రాష్ట్ర ప్రజలను తప్పుదోవ పట్టించింది ముఖ్యమంత్రి జగన్ అని కాకినాడ సిటీ టీడీపీ ఇన్‌చార్జ్ వనమాడి కొండబాబు అన్నారు. అందువల్ల ఈరోజు అంగన్‌వాడీలు, ఒప్పంద కార్మికులు, ఉపాధ్యాయులు రోడ్డెక్కిన పరిస్థితులు దాపురించాయన్నారు. సమస్యలు పరిష్కరించలేని జగన్ ప్రభుత్వం వారిని ఇబ్బందులకు గురి చేసే చర్యలకు పూనుకుందన్నారు. రాష్ట్రానికి పెట్టుబడి చంద్రబాబు అని ఆయనను కాపాడుకునే బాధ్యత అందరిపైన ఉందన్నారు.

కేజీ బేసిన్ ద్వారా అధిక మొత్తంలో ఉత్పత్తులు

ఓఎన్జీసీ ఈడీ అమిత్ నారాయణ్



అల్లవరం, జనవరి 10: కృష్ణా-గోదావరి బేసిన్ పరిధిలో చమురు, సహజవాయివు ఉత్పత్తులు గణనీయంగా పెరగడంతో దేశంలోనే అగ్రగామిగా నిలిచిందని ఓఎన్జీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అమిత్‌నారాయణ్ పేర్కొన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అల్లవరానికి బుధవారం ఆయన విచ్చేశారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ ఓఎన్జీసీ కేజీ బేసిన్ అధిక ఉత్పత్తుల సాధనపై ప్రధాని నరేంద్రమోదీ అభినందించారన్నారు. ఈస్టర్న్ ఆఫ్‌షోర్ బావుల నుంచి అత్యధిక ఉత్పత్తులు సాధిస్తూ గడిచిన ఇరవై ఏళ్లలో అగ్రస్థానంలో నిలిచిందని, తద్వారా దేశానికి డొమెస్టిక్ గ్యాస్ పది శాతం దాటి అందిస్తున్నామన్నారు. కోనసీమ జిల్లా తాటిపాక రిఫైనరీ, నాగాయిలంక నుంచి 60 శాతం ఉత్పత్తులు సాధించడం గర్వకారణమన్నారు. ఆన్‌షోర్ బావుల ద్వారా రోజుకు 650 టన్నుల క్రూడాయిల్, 21 లక్షల క్యూబిక్ మీటర్ల గ్యాస్ ఉత్పత్తి జరుగుతోందన్నారు. ఈ ఏడాది చివరికి ఇది 750 టన్నులకు పెరుగుతుందన్నారు. తమ కార్యకలాపాల ద్వారా ఆంధ్రప్రదేశ్‌కు ఏడాదికి రూ.600 కోట్లు రాయల్టీగా చెల్లిస్తున్నామన్నారు. సీఎస్ఆర్ నిధులతో పలు సదుపాయలు కల్పిస్తున్నామన్నారు. ఓఎన్జీసీ రాజమహేంద్రవరం ఎసెట్ చమురు ఉత్పత్తుల్లో అగ్రగామిగా నిలిచి సీఎస్ఆర్ నిధులు ఎక్కువగా ఇచ్చేస్థాయికి చేరుకుందని ఈడీ అమిత్‌నారాయణ చెప్పారు.

జైళ్లశాఖ డీఐజీ ప్రత్యేక పూజలు

అన్నవరం, జనవరి 10 : రత్నగిరిపై కొలువు దీరిన సత్యదేవుడి సన్నిధిలో బుధవారం జైళ్ల శాఖ డీఐజీ రవికిరణ్ కుటుంబసభ్యులతో స్వామిని దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయనకు ఆలయ అధికారులు ఆలయ మర్యాదలతో ఘన స్వాగతం పలికారు. దర్శనానంతరం వేద పండితులు వేదాశీర్వచనాలు అందజేశారు. ఏపీఆర్వో ఎం.గణపతిరావు తదితరులున్నారు.



స్వాగతం పలుకుతున్న పండితులు

తప్పించుకుని తిరుగుతున్న నేరస్థుల అరెస్టు

జగ్గంపేట, జనవరి 10: జగ్గంపేట పోలీస్ సర్కిల్ పరిధిలోని కిర్లంపూడి పోలీస్‌స్టేషన్‌కు సంబంధించిన ఒక గంజాయి రవాణా కేసులో నిందితులుగా ఉన్న ఇద్దరు వ్యక్తులను అరెస్ట్ చేశామని, మరో ముగ్గురు కోసం గాలిస్తున్నట్లు జగ్గంపేట సీఐ ఎస్.లక్ష్మణరావు తెలిపారు. జగ్గంపేట సర్కిల్ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేఖర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 2021 డిసెంబరులో విశాఖపట్నం ఏజెన్సీలో గల ధారకొండ గ్రామం నుంచి మహారాష్ట్రకు 152 ప్యాకెట్లతో ఉన్న 750 కిలోల గంజాయిని తరలిస్తున్న స్కార్పియో వాహనం కత్తిపూడి వద్ద పోలీసుల నుంచి తప్పించుకునే ప్రయత్నంలో పలు దారులలో తిప్పితిప్పి చివరకు కిర్లంపూడి మండలం తామరాడ వద్ద ఏటిగట్టున గంజాయి ప్యాకెట్లతో వదిలేశారని తెలిపారు. పోలీసులను నుంచి తప్పించుకునే ప్రయత్నంలో తమ వాహనంతో స్కూటీపై వెళుతున్న ఒక వ్యక్తిని గొల్లప్రోలు టోల్‌గేట్ సమీపంలో ఢీ కొట్టడంతో అతను మృతి చెందాడని తెలిపారు. ఈ కేసు అప్పట్లో సంచలనం అయిందన్నారు. దీనికి సంబంధించి నిందితులు, అప్పటి నుంచి తప్పించుకుని తిరుగుతున్నారని తెలిపారు. మంగళవారం కృష్ణవరం టోల్‌గేట్ వద్ద నిర్వహించిన తనిఖీలలో ఈ కేసులో ప్రధాన నిందితులు హనుమాన్ మెహిత్(27), సమీర్ సుధాకర్ గవాంది (29)లను గుర్తించి కిర్లంపూడి పోలీసులు అరెస్ట్ చేసినట్లు తెలిపారు. ఇదే ముఠాకు చెందిన అతుల్ ఓంకార్, సంజయ్ పాండురంగ, ఉమేష్ టాకిరే కోసం గాలిస్తున్నట్లు తెలిపారు.



గంజాయి(ఫైల్)

రైతులకు రూ.10 వేల పెన్షన్ ఇవ్వాలి

రాజమహేంద్రవరం అర్బన్, జనవరి 10 : రైతులకు ప్రతినెలా రూ.10 వేలు పెన్షన్ ఇవ్వాలని రైతులకు ఏదైనా సమస్య వస్తే రైతులందరూ ఏకమై ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలని, రైతులకు వ్యతిరేకంగా ఏదైనా చట్టాలు తీసుకొస్తే ఊరుకునేది లేదని ప్రభుత్వాన్ని రైతు సంఘం తరపున హెచ్చరించారు. రాజమహేంద్రవరంలో మూడు రోజుల పాటు జరిగిన ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర మహాసభలు బుధవారంతో ముగిశాయి. 35 తీర్మానాలను సభ ఆమోదించింది. ఈ సందర్భంగా నూతన కమిటీని ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షుడిగా పి.రామచంద్రయ్య, అధ్యక్షుడిగా జి.ఈశ్వరయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఏ.కాటమయ్య ప్రధాన కార్యదర్శిగా కేవీవీ ప్రసాద్, కార్యదర్శి కోశాధికారిగా వలవలపూడి రాములను ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షులుగా ఎ.రామానాయుడు, వి.హనుమారెడ్డి, ఎం.యల్లమందరావు, కార్యవర్గ సభ్యులుగా డేగా ప్రభాకర్, కె.జగన్నాథం, వి.జమలయ్య, సి.మల్లికార్జున, బుడితి అప్పలనాయుడులతో కూడిన 21 మంది కార్యవర్గం, 58 మందితో సమితిని ఎన్నుకున్నారు. భూ యాజమాన్య హక్కుల చట్టం 2023ను రద్దు చేయాలని, కౌలు రైతుల చట్టాన్ని సవరించి సులభంగా కౌలు రైతులకు గుర్తింపు కార్డులు జారీ చేయాలని, రైతుల ఆత్మహత్యలు అరికట్టే రుణ ఉపశమన చట్టాన్ని తీసుకురావాలని సాగునీటి ప్రాజెక్టులు త్వరగా పూర్తి చేయాలని, పోలవరం ముంపు ప్రజలను ఆదుకోవాలని, ఆక్వా రైతులకు రాయితీలు ఇవ్వాలని తదితర తీర్మానాలు చేశారు.

కారు ధ్వంసం..తప్పిన ప్రమాదం





యానాం, జవనరి 10: యానాం నియోజకవర్గంలోని ఫెర్రీ రోడ్డులో బీచ్ ప్రధాన రహదారిలో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో కారు నుజ్జునుజ్జు కాగా యువకులు ప్రమాదం నుంచి బయటపడ్డారు. మచిలీపట్నానికి చెందిన ఇద్దరు యువకులు మద్యం మత్తులో ఉండి శివలింగాల నుంచి ఎన్ఐసీ జెట్టీ వద్దకు ఓవర్‌స్పీడ్‌లో వచ్చి అటుగా వెళుతున్న కొంతమందిని తప్పించబోయి పక్కనే ఉన్న కరెంట్‌పోల్‌ను ఢీకొట్టారు. దీంతో కారు ముందు భాగం పూర్తిగా పాడై చక్రాలు విరిగిపోయాయి. ఆ సమయంలో కారులో ఉన్న ఇద్దరు సీటు బెల్టులు పెట్టుకుని ఉండటంతో బెలూన్స్ ఓపెన్ అవ్వడంతో ప్రాణాలతో బయటపట్టారు. ఈ సంఘటనలో ప్రాణనష్టం జరిగినప్పటికీ కారు నుజ్జునుజ్జయ్యింది. విషయం తెలుసుకున్న యానాం ట్రాఫిక్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని యువకులతో మాట్లాడి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కిక్ బాక్సింగ్ ఎంపికలు

నిడదవోలు, జనవరి 10: నిడదవోలు పట్టణంలోని ఎస్వీఆర్కే డిగ్రీ కళాశాలలో బుధవారం ఆదికవి నన్నయ విశ్వ విద్యాలయం స్థాయిలో వివిధ కళాశాలలకు చెందిన విద్యార్థులకు కిక్ బాక్సింగ్ ఎంపిక పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో ఎంపికైన క్రీడాకారులు జాతీయ విశ్వ విద్యాలయాల స్థాయి టోర్నమెంటులో పాల్గొంటారని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జ్యోతి తెలిపారు. ఈ పోటీలలో ఎం.రవి (ఎస్వీఆర్కే నిడదవోలు), బి.అర్జున్ (ఆదిత్య డిగ్రీ కాలేజ్ రాజమహేంద్రవరం), బి.ప్రవీణ్ కుమార్ (డీఆర్కే డిగ్రీ కాలేజ్, గొల్లల మామిడాడ), సీహెచ్ వెంకట్ (పీఆర్ గవర్నమెంటు డిగ్రీ కాలేజ్, కాకినాడ), బి.రవితేజ, (వీఎస్ఎమ్ డిగ్రీ కాలేజ్, రామచంద్రపురం), పి.ధనుష్ (పీఆర్ గవర్నమెంటు డిగ్రీ కాలేజ్, కాకినాడ), సీహెచ్ దినేష్ (గవర్నమెంటు డిగ్రీ కాలేజ్, రాజోలు) క్రీడాకారులు ఎంపికయ్యారు.



భారీ భోగి దండ



ఆలమూరు, జనవరి 10: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆలమూరు మండలం గుమ్మిలేరులో భారీ భోగి దండను తయారు చేశారు. 2019లో కిలోమీటరున్నర దండను తయారు చేసి రికార్డు సృష్టించారు. కొవిడ్ సమయంలో రెండేళ్లు సాధారణ దండలను తయారు చేశారు. గతేడాది కిలోమీటరు పొడవు రూపొందించారు. ఈ సంవత్సరం 600 మీటర్ల దండ తయారు చేశారు. ఉరదాలమ్మ ఆలయ కమిటీ చైర్మన్ ఈదల శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఆవుపేడను చింతలూరు, గుమ్మిలేరు గ్రామాల నుంచి సేకరించి మహిళలు దీనిని తయారు చేశారు. భోగి పండుగ నాడు భారీ ఊరేగింపు నిర్వహించి భోగి మంటలో వేస్తామని నిర్వాహకులు చెప్పారు.

కాటన్‌ను ఆదర్శంగా తీసుకోవాలి

కామన్వెల్త్ నేషన్స్ సెక్రటరీ జనరల్ పాట్రిసియా స్కాట్లాండ్

రాజానగరం, జనవరి 10 : గోదావరి డెల్టా రూపశిల్పి సర్ ఆర్థర్ కాటన్‌ను నేటి యువ ఇంజనీర్లు ఆదర్శంగా తీసుకోవాలని కామన్వెల్త్ నేషన్స్ సెక్రటరీ జనరల్ పాట్రిసియా స్కాట్లాండ్ పిలుపునిచ్చారు. గైట్ ఇంజనీరింగ్ కళాశాలను బుధవారం ఆమె సందర్శించారు. చైతన్య విద్యా సంస్థల వ్యవస్థాపకుడు కేవీవీ సత్యనారాయణరాజు (చైతన్యరాజు) అధ్యక్షతన జరిగిన సమావేశంలో పేట్రీషియా స్కాట్లాండ్‌కు గైట్ కళాశాల నుంచి సర్ ఆర్థర్ కాటన్ ఇన్నోవేషన్ అవార్డ్-2023ను చైతన్యరాజు, ఎండీ శశికిరణ్‌వర్మ అందజేశారు. చైతన్య విద్యాసంస్థల ద్వారా ప్రతీ ఏటా 100 కామన్వెల్త్ స్కాలర్‌షిప్స్ ఇచ్చేందుకు సంసిద్ధంగా ఉన్నామని చైతన్యరాజు, శశికిరణ్‌వర్మ ప్రకటించారు. దీని ద్వారా కామన్వెల్త్‌లోని 56 దేశాలకు చెందిన మెరిట్ విద్యార్థులు చైతన్య విద్యాసంస్థల్లో విద్యనభ్యసించవచ్చని చెప్పారు. ఈ కార్యక్రమంలో కాటన్ మేనకోడలు, కామన్వెల్త్ సెక్రటేరియట్ చీఫ్ డెబ్రామైఖేల్ గ్రేస్, సెక్రటరీ జనరల్ కార్యాలయ అధికారులు, ప్రొఫెసర్ ప్రజాపతి ద్వివేది, సునీల్ చంద్రరామ్, బర్కిలీలోని యూనివర్సిటీ ఆఫ్ కాలిఫోర్నియా గార్‌ఉడ్ సెంటర్ ఫర్ కార్పొరేట్ ఇన్నోవేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ప్రొఫెసర్ సాల్మన్ డార్విన్, మేఘాలయ ప్రభుత్వ ప్రిన్సిపాల్ కార్యదర్శి సంపత్‌కుమార్, బెంగళూరు క్రిస్ట్ యూనివర్సిటీ ప్రొఫెసర్ సాజివర్గేస్, రొమానియా ఏఐ ఎక్స్‌పర్ట్ సాబిన్‌డామ, స్మార్ట్ విలేజెస్ డైరెక్టర్ వైఎస్ మైఖేల్, రాజమహేంద్రవరం సబ్ కలెక్టర్ తేజ్ భరత్, ఆర్డీవో చైత్రవర్షిణి, రాజానగరం తహశీల్దార్ పవన్‌కుమార్, సీఐ పి.కాశీవిశ్వనాథ్ తదితరులు పాల్గొన్నారు.



అవార్డు ప్రదానం చేస్తున్న చైతన్యరాజు

మ్యూజియం సందర్శన

.రాజమహేంద్రవరం రూరల్, జనవరి 10: చారిత్రాత్మక కాటన్ మ్యూజియాన్ని కామన్వెల్త్ సెక్రటరీ జనరల్ పాట్రిసియా స్కాట్లాండ్ సందర్శించారు. తూర్పుగోదావరి జిల్లాకు వచ్చిన ఆమె బుధవారం నేరుగా ధవళేశ్వరం కాటన్ బ్యారేజీ వద్దకు చేరుకున్నారు. అక్కడ ఆమెకు జిల్లా జాయింట్ కలెక్టర్ తేజ్‌భరత్, ఆర్డీవో చైత్రవర్షిణి తదితర ఉన్నతాధికారులు స్వాగతం పలికారు. అనంతరం ఆమె కాటన్ మ్యూజియంలో బ్యారేజీ నమూనాలు, గోదావరి ప్రవాహ స్వరూపాన్ని పరిశీలించారు. అనంతరం కాటన్‌దొర జీవిత విశేషాలు, బ్యారేజీ చారిత్రక నేపథ్యాలను ఇరిగేషన్ అధికారులు ఎస్ఈ జి.శ్రీనివాసరావు, డీఈ కాశీవిశ్వేశ్వరరావు నుంచి ఆమె తెలుసుకున్నారు. కాటన్ బ్యారేజీకి ఐక్యరాజ్య సమితి ప్రపంచ వారసత్వ సంపదగా గుర్తింపు ఇచ్చినట్టు జాయింట్ కలెక్టర్ తేజ్‌భరత్ వివరించారు. ఈ సందర్భంగా పాట్రిసియా స్కాట్లాండ్ మాట్లాడుతూ చారిత్రక కలిగిన చిత్తరువులు వీక్షించడం తనకు ప్రత్యేక అనుభూతి కలిగిందన్నారు. ఆమె వెంట కాటన్ మేనకోడలు, కామన్వెల్త్ సెక్రటేరియట్ చీఫ్ డెబ్రామైఖేల్ గ్రేస్, ఎస్డీజీ ఇంప్లిమెంటేషన్ కార్యాలయ ప్రత్యేక ప్రతినిధి ప్రొఫెసర్ ప్రజాపతి ద్వివేది, బర్కిలీలోని యూనివర్సిటీ ఆఫ్ కాలిఫోర్నియా గార్ ఉడ్ సెంటర్ ఫర్ కార్పొరేట్ ఇన్నోవేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ప్రొఫెసర్ సాల్మన్ డార్విన్, కేంద్ర యువజన విభాగం, కామన్వెల్త్ సెక్రటేరియేట్ సునీల్ చంద్‌రామ్, గైట్ చైర్మన్ కేవీ సత్యనారాయణరాజు, వైస్ చైర్మన్ కే శశికిరణ్‌వర్మ, ఎస్ఈజీ శ్రీనివాసరావు, డీఈ ఆర్.కాశీవిశ్వేశ్వరరావు, తహశీల్దార్ పి.చిన్నారావు ఉన్నారు.

జైలు దాడి కేసులో ఒక్కొక్కరికి ఏడేళ్ల జైలు

యానాం, జవనరి 10: యానాంలో సంచలనం కలిగించిన జైలు దాడి కేసులో పుదుచ్చేరి కోర్టు తీర్పు వెలువరించింది. ఈ కేసులో దోషులుగా ఉన్న 12 మందికి 7 సంవత్సరాలు జైలు శిక్ష విధించినట్లు యానాం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ షణ్ముగం చెప్పారు. తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరులు సమావేశంలో వివరాలను వెల్లడించారు. పుదుచ్చేరిలో కరుడుకట్టిన నేరస్తుడు మణికంఠన్‌ను హత్య చేసేందుకు పుదుచ్చేరి నుంచి ప్లాన్ అమలు చేశారు. పుదుచ్చేరి జైలులో ఉన్న మణికంఠన్‌కు ప్రాణహాని ఉందని గ్రహించిన జైలు అధికారులు 2013లో భారీ భద్రతతో పుదుచ్చేరి నుంచి యానాం జైలుకు తరలించారు. యానాం జైలులో ఉన్న నేరస్తుడు మణికంఠన్‌ను హత్య చేసేందుకు 2013 ఆగస్టు 29న 18 మంది సభ్యులు బృందం యానాం జైలులోకి గోడ దూకి ప్రవేశించారు. ఆ సమయంలో అక్కడ విధులు నిర్వహిస్తున్న సిబ్బంది తక్షణం స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వడంతో మూడు బృందాలుగా విడిపోయిన పోలీసులు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి ఆయుధాలు స్వాధీనం చేసుకున్నారు. ఈ సంఘటనపై అప్పటికే ఎస్ఐ, ప్రస్తుతం సీఐగా ఉన్న షణ్ముగం చార్జిషీటు దాఖలు చేశారు. ఈ కేసులో నిందితులుగా ఉన్న వారిలో ఇద్దరు మృతి చెందగా మరో నలుగురిపై అభియోగాలు రుజువు కాకపోవడంతో మిగిలిన 12 మందిపై (పుదుచ్చేరికి చెందిన వారు) అభియోగాలు రుజువు కావడంతో వారికి పుదుచ్చేరి న్యాయస్థానం 7 సంవత్సరాలు జైలుశిక్ష విధించింది. దీంతో వీరిని పుదుచ్చేరిలోని కాలపేట జైలుకు తరలించనున్నారని సీఐ షణ్ముగం, ఎస్ఐ శేరు నూకరాజు తెలిపారు.



వివరాలు వెల్లడిస్తున్న సీఐ షణ్ముగం

నూతన నమూనాలయం భారీ స్థాయిలో అవసరం లేదు

అన్నవరం, జనవరి 10: జాతీయ రహదారిపై నూతనంగా నిర్మిస్తున్న నమూనాలయం అంత భారీస్థాయిలో కట్టనవసరం లేదని దేవదాయశాఖ సాంకేతిక సలహాదారు కొండలరావు పేర్కొన్నారు. దేవస్థానం ఈవో రామచంద్రమోహన్ అభ్యర్థన మేరకు బుధవారం రత్నగిరికి విచ్చేసి ఆజాద్ హయాంలో తీర్చిదిద్దిన రోడ్లను పరిశీలించారు. వనదుర్గ ఆలయం, మల్టీలెవెల్ కారు పార్కింగ్ తీర్చిదిద్దిన రోడ్డు, సీఆర్వో కార్యాలయం వద్ద నుంచి కొండ దిగువకు ఏర్పాటు చేసిన రోడ్డును పరిశీలించారు. ఈ రోడ్డుకు మరో పక్క రక్షణగోడ ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని సూచించారు. అదే విధంగా పలుచోట్ల లోతు ఉండడంతో దానిని గ్రావెల్‌తో పూడ్చాల్సిన అవసరముందని అన్నారు. ఈ పరిశీలనపై లిఖితపూర్వక నివేదికను అందజేస్తామని దేవస్థానం ఇంజనీరింగ్ అధికారులకు తెలియజేశారు. ముందుగా సత్యదేవుడిని దర్శించిన ఆయనకు ఆలయ అధికారులు ఘన స్వాగతం పలికారు. దర్శనానంతరం వేద పండితులు వేదాశీర్వచనం అందజేయగా దేవస్థానం ఈఈ నరసింహారెడ్డి స్వామివారి ప్రసాదం, చిత్రపటం అందజేశారు. సాంకేతిక సలహాదారు వెంట చీఫ్ ఇంజనీర్ శ్రీనివాసరావు ఉన్నారు.



సాంకేతిక సలహాదారుకు చిత్రపటం అందిస్తున్న దృశ్యం

సమ్మె బాటలో ఫీల్డ్ అసిస్టెంట్లు?

- 18కల్లా డిమాండ్లు పరిష్కరించకుంటే 19 నుంచి సమ్మె తప్పదని హెచ్చరిక

మండపేట, జనవరి 10: ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్లు సమ్మె బాట పట్టేందుకు సిద్ధమవుతున్నారు. ఈ నెల 18కల్లా డిమాండర్లు పరిష్కరించకుంటే 19 నుంచి సమ్మె తప్పదని వారు అంటున్నారు. గత పదేళ్ల నుంచి ఫీల్డ్ అసిస్టెంట్లగా పనిచేస్తున్న వారికి సమాన పనికి సమాన వేతనం రూ.26000లు ఇవ్వాలని, ఫీల్డ్ అసిస్టెంట్లను బదిలీ చేయాలని, ప్రతిఏటా 7500 పని దినాలు విధానం రద్దు చేయాలని ఫీల్డ్ అసిస్టెంట్లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు. అలాగే ప్రస్తుతం తమకు ప్రభుత్వం చెల్లిస్తున్న కనీస వేతనం రూ.5500 స్థానంలో రూ.26000 పెంచి వేతనం ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. ఇప్పటికే తమ సమస్యలపై ఈ నెల 4న అమరావతిలో ఉన్నతాధికారులను కలిసి విన్నవించుకున్నామని చెప్పారు. అయితే ఈ నెల18 కల్లా ఫీల్డ్ అసిస్టెంట్ల సమస్యను పరిష్కరిస్తామని అధికారులు ఇచ్చిన హామీ నెరవేరకుంటే తాము కూడా ఈనెల 19 నుంచి సమ్మె బాట పడతామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో 22 మండలాల్లో సుమారు 300 మంది ఫీల్డ్ అసిస్టెంట్లు పనిచేస్తున్నారు.



కూలీల హాజరు వేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లు(ఫైల్)

సొమ్మసిల్లి పడిపోయిన అంగన్వాడీ వర్కర్



సపర్యలు చేస్తున్న వర్కర్లు

రాజవొమ్మంగి జనవరి 10: రాజవొమ్మంగిలో బుధవారం అంగన్వాడీ వర్కర్లు 30వ రోజు నిరవధిక సమ్మెలో భాగంగా ఆర్‌అండ్‌బీ అతిథి గృహ సమీపంలో దీక్ష శిబిరం వద్ద నిరసన చేపట్టారు. బుధవారం మధ్యాహ్నం లాగరాయి -1 అంగన్వాడీ టీచర్ కె.మంగ సొమ్మసిల్లి పడిపోవడంతో తోటి అంగన్వాడీ వర్కర్లు వెంటనే స్పందించి సపర్యలు చేశారు. అంగన్వాడీ హెల్పర్స్ అండ్ వర్కర్స్ యూనియన్ రంపచోడవరం జిల్లా ప్రధాన కార్యదర్శి బి.నిర్మల మాట్లాడుతూ ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ప్రభుత్వం దిగిరాక తప్పదన్నారు.

కారు ఢీకొని వీఆర్ఏ దుర్మరణం



రాజానగరం, జనవరి 10: గోకవరం తహసీల్దార్ కార్యాలయంలో వీఆర్ఏగా విధులు నిర్వర్తిస్తున్న కొల్లాటి ప్రసాద్ (40) బుధవారం రాత్రి కారు ఢీకొనడంతో మరణించారు. రాజానగరంలో నివాసం ఉంటున్న ప్రసాద్ విధి నిర్వహణలో భాగంగా గోకవరం వెళ్లి మోటార్ సైకిల్‌పై ఇంటికి తిరిగి వస్తున్నాడు. మార్గమధ్యంలో రాజానగరం మండలం నందరాడ సమీపానికి వచ్చేసరికి ఎదురుగా వస్తున్న ఇండికా కారు ప్రసాద్‌ను బలంగా ఢీకొన్నది. వీఆర్ఏ హెల్మెట్ ధరించినప్పటికీ తలకు బలమైన గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతిచెందారు. ఆయనకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఈ మేరకు రాజానగరం పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఏజెన్సీ సమాచారం

సమాన పనికి సమాన వేతనమివ్వాలి

ఐటీడీఏ ఎదుట ఔట్‌సోర్సింగ్ కార్మికుల ధర్నా



ధర్నా చేస్తున్న కార్మికులు

రంపచోడవరం, జనవరి 10: గిరిజన సంక్షేమ శాఖలో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్ కార్మికులకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని బుధవారం సీఐటీయూ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించి ఐటీడీఏ ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లపు వెంకట్ మాట్లాడుతూ ఐటీడీఏ పరిధిలోని ఆశ్రమ పాఠశాలల్లో గత 30 ఏళ్లుగా పని చేస్తున్న ఔట్‌సోర్సింగ్ కార్మికులు విద్యార్థులకు భోజనం వండి పెడుతున్నారని, ఎన్ని ప్రభుత్వాలు మారుతున్న వారి జీవితాల్లో మార్పులు రావడం లేదన్నారు. నిత్యావసరాల ధరలు ఆకాశాన్నంటుతుంటే కార్మికులకు ఇచ్చే వేతనాలు మాత్రం పెరగడం లేదన్నారు. గిరిజన సంక్షేమ శాఖలో పనిచేస్తున్న కార్మికుల వేతనాలు నెలకు రూ.26 వేలు పెంచి, ఉద్యోగ భద్రత కల్పించి, రిటైర్మెంట్ బెనిఫిట్స్ కల్పించాలన్నారు. గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లోతా రామారావు మాట్లాడుతూ ఐటీడీఏలు గిరిజనులకు మేలు చేయకుండా గిరిజన కార్మికుల శ్రమను దోపిడీ చేస్తున్నాయని ఆరోపించారు. ఆశ్రమ పాఠశాలల్లో ఏఎన్‌ఎంలను నియమించాలని డిమాండ్ చేశారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్నాన్ని డీడీ అబుసలాంకు అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు కె.శాంతిరాజు, గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు ఈతపల్లి సిరిమల్లిరెడ్డి, ఔట్‌సోర్సింగ్ యూనియన్ నాయకులు కారం శ్రీను, సోడి దుర్గారావు, కోసం శ్రీనివాసు, కారం చంద్రమ్మ, పుల్లమ్మ, తిరుపతమ్మ, వెంకటేశ్వర్లు, వరలక్ష్మి, రత్నం, ఎస్.వెంకటేశ్వర్లు, బాలమ్మ, వీరాస్వామి, బ్రహ్మయ్య, వీరయ్య, లక్ష్మి పాల్గొన్నారు.

మెరుగైన వైద్యం అందించాలి

రంపచోడవరం, జనవరి 10: ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో మెరుగైన వైద్యం అందించాలని ఎంపీపీ బంధం శ్రీదేవి వైద్యాధికారులకు సూచించారు. బుధవారం ఆమె అధ్యక్షతన నరసాపురం, పెదగెద్దాడ పీహెచ్‌సీలలో హెచ్‌డీఎస్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రజా ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. గర్భిణీలకు ప్రసవం తర్వాత వచ్చే రాయితీలను ఎటువంటి అ వకతవకలకు పాల్పడకుండా నేరుగా లబ్ధిదారులకు అందజేయాలన్నారు. ప్రసవాలు ఆసుపత్రిలో జరిగేలా సిబ్బంది అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారులు, ఎంపీటీసీ వంశీ కుంజం, సర్పంచ్ వడగల ప్రసాద్, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

సీసీ రోడ్డుకు శంకుస్థాపన

మోతుగూడెం, జనవరి 10: చింతూరు మండలం మోతుగూడెం పంచాయతీ నందు పాత మసీదు నుంచి వినాయక గుడి వరకు ఎంపీపీ నిధులు నుంచి సుమారు రూ.2 లక్షలు రూపాయలతో సీసీ రోడ్డు నిర్మాణానికి మోతుగూడెం సర్పంచ్ ఆకేటి సీత బుధవారం భూమిపూజ చేశారు. చింతూరు మండల ఎంపీపీ అమల, జడ్పీటీసీ చిచ్చడి మురళీ, మండల కన్వీనర్ వై.రామలింగారెడ్డి, వైస్ ఎంపీపీ సుధాకర్ (చిన్ని), పంచాయతీ ప్రతినిధులు, వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు

డైరీ ఆవిష్కరణ

రంపచోడవరం, జనవరి 10: ఆంధ్రప్రదేశ్ గిరిజన సంక్షేమ ఉపాధ్యాయ అ సోసియేషన్-2024 డైరీని గిరిజన సంక్షేమ శాఖ ఉప సంచాలకులు అబుసలాం బుధవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో గిరిజన సంక్షేమ ఉపాధ్యాయ అసోసియేషన్ రాష్ట్ర చైర్మన్ కారం రంగారావు, జిల్లా అధ్యక్షుడు బి.మంగిరెడ్డి, కార్యదర్శి ఎం.కరుణవిలాస్, జిల్లా గౌరవ అధ్యక్షుడు చవలం సత్యనారాయణ, రాష్ట్ర సెక్రటరీ కారికోడి గాంధీబాబు, జాయింట్ సెక్రటరీ పల్లాల బాలురెడ్డి పాల్గొన్నారు.

కొనసాగుతున్న అంగన్వాడీల దీక్ష



మాట్లాడుతున్న నిర్మల

రాజవొమ్మంగి జనవరి 10: తమ సమస్యలు పరిష్కరించకుండా ఎన్ని బెదిరింపులకు పాల్పడినా అంగన్వాడీ కేంద్రాలు తెరిచేది లేదని అంగన్వాడీ హెల్పర్స్ అండ్ వర్కర్స్ యూనియన్ రంపచోడవరం జిల్లా ప్రధాన కార్యదర్శి బి.నిర్మల అన్నారు. రాజవొమ్మంగిలో అంగన్వాడీ యూనియన్ నాయకులు చిన్ని కుమారి, బి.వెంకటలక్ష్మి ఆధ్వర్యంలో బుధవారం 30వ రోజు అంగన్వాడీ వర్కర్లు నిరవధిక దీక్షలో కూర్చున్నారు. 30 రోజులుగా అంగన్వాడీ వర్కర్లు చేస్తున్న నిరవధిక సమ్మెపై ప్రభుత్వం స్పందించకపోవడం దారుణమని నిర్మల అన్నారు సీఐటీయూ జిల్లా నాయకులు పి.రామరాజు, అంగన్వాడీ యూనియన్ నాయకులు సత్యవతి, నూకరత్నం, రమణ, రమణి, మంగ, సుందరమ్మ, రత్నం, మేరీ, రాధ, భవాని, రాజేశ్వరి, లక్ష్మి, వీరయ్యమ్మ, వీరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

రక్తదాన శిబిరాన్ని జయప్రదం చేయాలి

కూనవరం, జనవరి 10: ఈనెల 13న జరిగే రక్తదాన శిబిరాన్ని జయప్రదం చేయాలని చేయూత బ్లడ్ ఆర్గనైజర్ మచ్చ వినయ్ అన్నారు. విలీన మండలాల్లో రక్తకొరత చాలా ఏర్పడిందని, ఆ కారణంగానే ఈనెల 13 శనివారం కూనవరం జడ్పీహెచ్‌ఎస్ పాఠశాల వద్ద రక్తదాన శిబిరం ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఈ ప్రాంతంలో గిరిజనులు రక్తం అందక ఇంకా తెలంగాణా ఆసుపత్రుల మీదే ఆధారపడి ఉన్నారన్నారు. ఈ కొరతను తీర్చేందుకే ఈ రక్తదాన శిబిరం ఏర్పాటు చేసినట్లు చెప్పారు. రక్తదానం చేసినవారికి రంపచోడవరం ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ ద్వారా సర్టిఫికెట్ అందజేయనున్నట్లు చెప్పారు.

ఇంటి నిర్మాణానికి సాయం



సాయం అందిస్తున్న ట్రస్ట్ సభ్యులు

ఎటపాక, జనవరి 10: ఎటపాక మండలం, గన్నవరం గ్రామంలో ఇటీవల జరిగిన అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయిన రావి భూషణం కుటుంబానికి జామాల్‌ఖాన్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఇంటి నిర్మాణ సామగ్రిను అందించారు. రూ.33 వేల విలువైన సిమెంట్ రేకులు, ఇసుక గొట్టాలను బుధవారం ఆయుర్వేదిక్ డాక్టర్ జామాల్‌ఖాన్ అందజేశారు. దీంతో పాటు ఇంటి నిర్మాణానికి అవసరమయ్యే ఇటుక, సిమెంట్ కొనుగోలు కోసం మరో రూ.16 వేల నగదును కూడా బాధిత కుటుంబానికి అందించారు. ఈ కార్యక్రమంలో జామాల్‌ఖాన్ చారిటబుల్ ట్రస్ట్ ఇన్‌చార్జ్ సయ్యద్ సుభాని, గ్రామ పెద్దలు కరి నర్సింహారావు, కరి వెంకట్రావు, కరి పెద్ద శ్రీను, ఏసుపాక పెదబాబు తదితరులు పాల్గొన్నారు.

వాలీబాల్ టోర్నమెంట్

ఎటపాక, జనవరి 10: కృష్ణవరం గ్రామంలో గురువారం నుంచి శ్రీ నందమూరి తారకరామారావు మెమోరియల్ మండల స్థాయి వాలీబాల్ టోర్నమెంట్‌ను ప్రారంభించనున్నట్లు తెలుగు యువత నాయకుడు దానే ప్రసాద్ తెలిపారు. ఈ నెల 11 నుంచి 14వ తేదీ వరకు టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. విన్నర్స్ జట్టుకు ప్రైజ్ మనీ రూ.8 వేలు, రెండో స్థానంలో నిలిచిన జట్టుకు రూ.5 వేలు ప్రైజ్ మనీ ఇవ్వనున్నట్లు చెప్పారు.

18న ఆర్టీసీ అన్‌ఐడెంటిఫైడ్ పార్శిల్స్ వేలం

రాజమహేంద్రవరం అర్బన్, జనవరి 10 : రాజమహేంద్రవరం కార్గో పార్శిల్ కార్యాలయంలోని అన్ ఐడెంటిఫైడ్ (ఎవరూ తీసుకెళ్లని) పార్శిల్స్‌ను ఈనెల 18వ తేదీ గురువారం బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు ఆర్టీసీ అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్ (కమర్షియల్) బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆ రోజు ఉదయం పదిన్నర గంటలకు రాజమహేంద్రవరం బస్‌స్టేషన్‌లోని పార్శిల్ బుక్కింగ్ కార్యాలయం వద్ద వేలం జరుగుతుందని, ఆసక్తిగల పాటదారులు పాల్గొనవచ్చని ఆయన పేర్కొన్నారు.

భిక్షాటన చేస్తూ అంగన్‌వాడీల నిరసన

● **30వ రోజుకు చేరిన సమ్మె**



రాజానగరంలో భిక్షాటన చేస్తున్న అంగన్‌వాడీలు

రాజానగరం, జనవరి 10: తమ డిమాండ్ల సాధన కోరుతూ అంగన్‌వాడీలు చేపట్టిన నిరవధిక సమ్మె 30రోజులకు చేరుకుంది. ఈసందర్భంగా అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్పర్లు బుధవారం రాజానగరంలో భిక్షాటన చేసి తమ నిరసన తెలిపారు. స్థానిక మెయిన్‌రోడ్డులోని వివిధ దుకాణదారులు, వ్యాపార సంస్థల వద్దకు వెళ్లి భిక్షమెత్తారు. అఖిలభారత రైతు కూలీ సంఘం జిల్లా అధ్యక్షుడు జనిపల్లి సత్తిబాబు శిబిరాన్ని సందర్శించి మద్దతు ప్రకటించారు. అనంతరం మాట్లాడుతూ సమ్మె ప్రారంభమైన 30 రోజులు పూర్తయినప్పటికీ ప్రభుత్వానికి ఏమాత్రం చిత్తశుద్ధి లేదన్నారు. ఎందుకు వివక్షత చూపుతున్నారో చెప్పాలని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. అంగన్‌వాడీల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించకుండా బెదిరింపులకు పాల్పడ్డం సరికాదన్నారు. అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించే వరకు సమ్మె కొనసాగించాలని అంగన్‌వాడీలకు సత్తిబాబు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రాజానగరం ప్రాజెక్టు నాయకురాలు ఎం.మార్త, బి.బేబి, ఎస్.పాప, చంద్ర, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

ఎల్ఐసీ యూనియన్ నాయకుల సంఘీభావం



అంగన్‌వాడీలకు సంఘీభావం తెలుపుతున్న ఎల్ఐసీ యూనియన్ నాయకులు

గోకవరం, జనవరి 10: స్థానిక ఎంపీడీవో, రెవెన్యూ కార్యాలయాల గేటు ముందు గత 30 రోజులుగా అంగన్‌వాడీలు నిర్వహిస్తున్న నిరసన దీక్షకు బుధవారం గోకవరం ఎల్ఐసీ యూని యన్ తమ సంఘీభావాన్ని తెలిపారు. ఈసందర్భంగా ఎల్ఐసీ యూనియన్ నాయకులు మా ట్లాడుతూ ప్రభుత్వం వెంటనే అంగన్‌వాడీల న్యాయపరమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించాలన్నారు. అంగన్‌వాడీలపై ఎస్మా ప్రయోగించడం, వారికి నోటీసులు ఇవ్వడం సమంజసంగా లేదన్నారు.

మైనార్టీలను అభివృద్ధిచేసింది టీడీపీయే

● **స్లాటర్ హౌస్‌కు 35కేవీ జనరేటర్ అందజేతలో ఆదిరెడ్డి**



స్లాటర్ హౌస్‌కు 35కేవీ జనరేటర్ అందజేస్తున్న ఆదిరెడ్డి అప్పారావు, ఆదిరెడ్డి శ్రీనివాస్

రాజమహేంద్రవరం సిటీ, జనవరి 10: మైనార్టీలను అన్నివిధాలా అభివృద్ధి చేసింది తెలుగుదేశం ప్రభుత్వమేనని ఆ పార్టీ సీనియర్ నేత మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఆదిరెడ్డి శ్రీనివాస్‌లు అన్నారు. రాజమహేంద్రవరం రోడ్డులోని స్లాటర్ హౌస్‌కు బుధవారం తమ భవానీ చారిటబుల్ ట్రస్ట్ తరపున 35కేవీ జనరేటర్‌ను వారు అందించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ జగన్ ప్రభుత్వం ఈ నాలుగున్నరేళ్లలో నగరంలో ఒక్క షాదీఖాన నిర్మించలేదన్నారు. మసీదుల అభివృద్ధి చేయలేదు కాని ఎన్నికల ముందు వచ్చి ముస్లీంల కోసం అది చేస్తాను, ఇది చేస్తామంటూ ఎంపీ భరత్ రామ్ హామీలు ఇవ్వడం విడ్డూరంగా ఉందన్నారు. మీటింగులు పెట్టి బలవంతంగా జాయినింగ్‌లు చేసి మైనార్టీలను మోసం చేయడం అంతనికే సాధ్యమన్నారు. ఈ కార్యక్రమంలో నూర్‌బాషా సాధికార సమితి రాష్ట్ర అధ్యక్షుడు షేక్ సుభాన్, మైనార్టీ సెల్ రాష్ట్ర కార్యదర్శి ఖాన్ బాషా, టీడీపీ నగర కార్యనిర్వాహక కార్యదర్శి ద్వారా పార్వతి సుందరి, పార్లమెంట్ కమిటీ అధ్యక్షుడు మహబూబ్ జానీ, కార్యదర్శి మహబూబ్ ఖాన్, టీడీపీ నగర కార్యదర్శి లాల్‌ఖాన్, టిఎన్‌టీయూసీ నగర ప్రధాన కార్యదర్శి మిస్కా జోగినాయుడు, మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి బషీర్, షేక్ మదీనా సాహెబ్ తదితరులు పాల్గొన్నారు.

రాజమహేంద్రవరంలో టీడీపీ అభివృద్ధి ఆనవాళ్లు చూడండి

● **మీ భరత్ అట్టర్ ప్లాప్ స్టార్**

● **టీడీపీ ఎస్సీసెల్ నగర అధ్యక్షుడు చాపల**



సమావేశంలో మాట్లాడుతున్న చాపల చిన్నరాజు

రాజమహేంద్రవరం సిటీ, జనవరి 10: రాజమహేంద్రవరంలో టీడీపీ హయాంలో ఎంత అభివృద్ధి చేశామో ఆయా ఆనవాళ్లు చూస్తే ఇట్టే తెలిసిపోతుందని ఆ పార్టీ నగర ఎస్సీసెల్ అధ్యక్షుడు చాపల చిన్నరాజు, టీడీపీ లీగల్‌సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాచపల్లి ప్రసాద్‌లు అన్నారు. రాజమండ్రి ప్రెస్‌క్లబ్‌లో బుధవారం జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. వచ్చే ఎన్నికల్లో గెలవమనే భయంతో ముందుగానే ప్రజల్లోకి పాజిటివ్‌గా వాయిస్ తీసుకువెళ్లేందుకు భరత్ రామ్ అనుచరులు నక్కా శ్రీనగేష్, చిట్టూరి ప్రవీణ్ చౌదరిలు బురదజల్లే ప్రయత్నాలు చేస్తున్నారని మండిపడ్డారు. మీరెన్ని చేసిన రాజమహేంద్రవరంలో విజయం టీడీపీదేనని తమ నేత ఆదిరెడ్డి శ్రీనివాస్ పైన లేనిపోని అవాకులు చవాకులు పేలుతున్నారని అన్నారు. ఈ నాయకులు పరిస్థితి ఏమిటో ప్రజలందరికీ తెలుసునన్నారు. జగన్ పాలనలో దళితులు అన్యాయమైపోయారని అన్నారు. ఎస్సీ కార్పొరేషన్‌కు నిధులు ఇవ్వకుండా నిర్వీర్యం చేశాడని ధ్వజమెత్తారు. ఈ సమావేశంలో ఎస్సీసెల్ నగర ప్రధాన కార్యదర్శి మామిడి శ్రీనివాస్, కార్యనిర్వాహక కార్యదర్శి బత్తిన రవికుమార్, సోషల్ మీడియా కోఆర్డినేటర్ దొండపాటి రాజు, ఉపాధ్యక్షుడు ఉడమల నాగేశ్వరావు, రాచర్ల వెంకటరమణ, కార్యనిర్వాహక కార్యదర్శి పోసుపో శేఖర్, కార్యదర్శి మట్టాడి శరత్ కుమార్, లీగల్ సెల్ కార్యనిర్వాహక కార్యదర్శి బొమ్మాలి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

హిట్ అండ్ రన్ జీవోను రద్దు చేయాలని ఆందోళన



ప్రధాన రహదారిపై బైఠాయించిన లారీ డ్రైవర్లు

గోకవరం, జనవరి 10: కేంద్ర ప్రభుత్వం నూతనంగా అమలు చేయబోతున్న హిట్ అండ్ రన్ జీవోను వెంటనే రద్దు చేయాలని కోరుతూ గోకవరం మండలం గుమ్మళ్లదొడ్డి ఐవోసీఎల్ ఆయిల్ కంపెనీ వద్ద బుధవారం లారీ డ్రైవర్లు ఆందోళన నిర్వహించారు. స్థానికంగా ఉన్న హెచ్‌పీసీఎల్, ఐవోసీఎల్, హెచ్‌పీ గ్యాస్ కంపెనీలకు చెందిన సుమారు 300 మంది లారీ డ్రైవర్లు లారీలను నిలిపివేసి ఐవోసీఎల్ ఆయిల్ కంపెనీ ఎదురుగా ప్రధాన రహదారిపై బైఠాయించి నిరసన చేపట్టారు. ఈసందర్భంగా ఆందోళనకారులు మాట్లాడుతూ ఇటీవల కేంద్ర ప్రభుత్వం అమలు చేయబోతున్న 106 చట్టాన్ని వెంటనే రద్దుచేయాలని డిమాండ్ చేశారు. 55 సంవత్సరాలు నిండిన ప్రతీ లారీ డ్రైవర్‌కు పెన్షన్ సదుపాయం కల్పించాలని, ప్రమాదాల సంఘటనల్లో బాధ్యులైన డ్రైవర్లకు 10 సంవత్సరాల జైలుశిక్ష, రూ.7లక్షల జరిమానా అనే నిర్ణయాన్ని వెంటనే ఉపసంహ రించుకోవాలన్నారు. కేంద్ర ప్రభుత్వం నుంచి తమకు సానుకూల స్పందన లభించేవరకు తమ నిరసన కార్యక్రమాన్ని కొనసాగిస్తూనే ఉంటామని డ్రైవర్లు హెచ్చరించారు.

ఘనంగా ప్రారంభమైన వాలీబాల్ పోటీలు

కడియం, జనవరి 10: ఆడుదాం ఆంధ్రా కార్యక్రమంలో భాగంగా మండల స్థాయిలో వాలీబాల్ పోటీలు బుధవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. జేగురుపాడు ఉన్నత పాఠశాల ఆవరణలో మూడు రోజుల పాటు జరగనున్న ఈ వాలీబాల్ పోటీలను గ్రామ సర్పంచ్ యాదల సతీష్‌చంద్రస్టాలిన్ ప్రారంభించారు. ఈ పోటీలకు 70 మంది పురుష, 70 మంది మహిళా జట్లు మొత్తం 600 మంది క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొన్నట్లు మండల క్రీడాధికారి ఎం.డేవిడ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో కె.రత్నకుమారి, తహసీల్దారు ఎం.సుజాత, సచివాలయ ఉద్యోగులు, మండలంలో వివిధ పాఠశాలల పీడీలు పాల్గొన్నారు. కడియం ఉన్నత పాఠశాలలో మండల స్థాయిలో ఈనెల 12న ఖోఖో, షటిల్‌బ్యాడ్మింటన్ పోటీలు, 17 నుంచి 20 వరకు క్రికెట్, కబడ్డీ పోటీలు జరుగుతాయని మండల క్రీడాధికారి ఎం. డేవిడ్ తెలిపారు.



జేగురుపాడులో వాలీబాల్ పోటీలను ప్రారంభిస్తున్న సర్పంచ్ స్టాలిన్

కోట సత్తెమ్మ ఆలయంలో హుండీ లెక్కింపు

నిడదవోలు, జనవరి 10: నిడదవోలు మండలం తిమ్మరాజుపాలెలో ఉన్న కోటసత్తెమ్మ అమ్మవారి దేవస్థానంలో బుధవారం హుండీల లెక్కింపు నిర్వహించారు. 27-09-2023 నుంచి 09-01-2024 వరకు సుమారు 105 రోజులకుగాను హుండీల ద్వారా నగదు రూ.28,07,946ల ఆదాయం లభించగా అన్నదాన ట్రస్ట్ హుండీ ద్వారా రూ.68,095 లభించగా 024 గ్రాముల బంగారం, 250 గ్రాముల వెండి, విదేశీ కరెన్సీ లభించినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి బళ్ల నీలకంఠం తెలిపారు.

హంస వాహనంపై దర్శనమిచ్చిన శ్రీనివాసుడు





బలభద్రపురంలో హంస వాహనంలో ఊరేగుతున్న శ్రీనివాసుడు, హంస వాహనాన్ని లాగుతున్న భక్తులు

బిక్కవోలు, జనవరి 10: తూర్పు తిరుమలగా పేరొందిన బలభద్రపురంలో నిర్మించిన శ్రీదేవి, భూదేవి సమేత ప్రసన్న వెంకటేశ్వరస్వామి ఆలయంలో నిర్వహిస్తున్న స్వామి, అమ్మవార్ల బ్రహ్మోత్సవాలు బుధవారం ఆరవ రోజుకు చేరాయి. ఈసందర్భంగా ఉదయం స్వామి అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలకు శ్రీమాన్ వాడపల్లి గోపాలాచార్యులు ఆధ్వర్యంలో సహస్ర కలశాభిషేకం, ధనుర్మాస వ్రతం నిర్వహించారు. సాయంత్రం స్వామి, అమ్మవార్లను విశాఖపట్నంకు చెందిన కొవ్వూరి రమాకాంతరెడ్డి, మంగ దంపతులు తయారు చేయించిన హంస వాహనంపై వుంచి గ్రామ పురవీధులగుండా ఊరేగించారు. ఈసందర్భంగా స్వామి వారి హంస వాహనం లాగడానికి భక్తులు పోటీ పడ్డారు. అనంతరం ప్రత్యేక ఉత్సవం, సంవరోత్సవం జరిపారు. స్వామి అమ్మవార్లను దర్శించుకోవడానికి వచ్చిన భక్తులకు అన్నదాన ఏర్పాట్లు చేసినట్లు ఆలయ వ్యవస్థాపక కమిటీ అధ్యక్షుడు మల్లిడి గంగారెడ్డి తెలిపారు.

అయోధ్య రామమందిరం ప్రారంభోత్సవానికి హోంమంత్రికి ఆహ్వానం

కొవ్వూరు, జనవరి 10 : అయోధ్య నుంచి వచ్చిన శ్రీరాముని అక్షింతలు, ఆహ్వానపత్రికను హోంమంత్రి తానేటి వనితకు అందజేశారు. బుధవారం కొవ్వూరు క్యాంపు కార్యాలయంలో టి.ఎన్వీ రమణమూర్తి ఆధ్వర్యంలో ఆంధ్రగీర్వాణ విద్యాపీఠం బృందం మంత్రిని కలిసి రామమందిరం ప్రారంభోత్సవానికి ఆహ్వానం అందించారు. మంత్రి వనితకు శేషవస్త్రంతో సత్కరించారు. మంత్రి వనిత మాట్లాడుతూ ఈనెల 22న అయోధ్య శ్రీరామమందిర ప్రారంభోత్సవానికి ఆహ్వానం అందడం చాలా సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో రామా సొసైటీ అధ్యక్షుడు అక్షయపాత్ర శ్రీనివాస రవీంద్ర పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రామకృష్ణారెడ్డి

అవినీతి ఆరోపణలు చేయడం తగదు

● **టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి**

బిక్కవోలు, జనవరి 10: ఇటీవల వైసీపీ నుంచి తెలుగుదేశం పార్టీలో చేరిన వారిపై అవినీతి ఆరోపణలు చేయడం వైసీపీ నేతలకు తగదని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి సూచించారు. బుధవారం ఆయన రంగాపురం గ్రామంలో ఇటీవల వైసీపీ గ్రామశాఖ అధ్యక్షుడు కనుమూరి సాయిరామకృష్ణంరాజు టీడీపీలో చేరడంతో ఆయనపై అవినీతి ఆరోపణ లు చేయడంతో ఆయన ఆధ్వర్యంలో విలేకర్ల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సాయిరామకృష్ణంరాజు మాట్లాడుతూ తాను 40 యేళ్లగా రాజకీయంలో వున్నానని, కాంగ్రెస్‌లో వున్న తాను ఆపై వైసీపీలో చేరానని, గతంలో వైసీపీ ఓడిపోయినా తన గ్రామంలో సర్పంచ్, ఎంపీటీసీలను గెలిపించుకున్నానన్నారు. ఇటీవల తనను అవినీతి పేరుతో పార్టీనుంచి తొలగించడంతో టీడీపీలో చేరానన్నారు. తాను ఎటువంటి అవినీతికి పాల్పడలేదని తన సొంత డబ్బే పార్టీకి ఖర్చు పెట్టానన్నారు. సమావేశంలో టీడీపీ నేతలు చిరంజీవిరాజు, అప్పలస్వామి, జోష్‌బాబు, దేవానందరెడ్డి, పాల్గొన్నారు.

అనపర్తి రెండవ ఎస్ఐగా రామారావు బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు స్వీకరిస్తున్న ఎస్ఐ రామారావు

అనపర్తి, జనవరి 10: అనపర్తి పోలీస్ స్టేషన్ లో రెండవ ఎస్ఐగా బుధవారం ఉండ్రాజవరంలో పనిచేస్తున్న ఎస్ఐ కె. రామారావు బాధ్యతలు స్వీకరించారు. ఈసందర్భంగా ఆయన సీఐ శివగణేష్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. మండలంలో శాంతి భద్రతల పరిరక్షణ కోసం కృషి చేస్తానని తెలిపారు.

దివ్య విద్యాసంస్థల్లో సంక్రాంతి సందడి



ప్రథమ బహుమతి సాధించిన ముగ్గుతో విద్యార్థినులు

రాజానగరం, జనవరి 10: రాజానగరంలోని దివ్య విద్యా సంస్థల్లో సంక్రాంతి సంబరాలతో సందడి నెలకొంటోంది. విద్యార్థులంతా సంప్రదాయ దుస్తులు వేషధారణలతో భోగి మంటలు, రంగవల్లులు, గాలిపటాలు, గొబ్బెమ్మలు, భోగిపండ్లు వేడుకలతో తెలుగు సంస్కృతిని ఇనుమడింపజేశారు. విద్యార్థులు ఆట, పాటలతో ఉల్లాసంగా, ఉత్సాహంగా కేరింతలు కొడుతూ సంక్రాంతిని జరుపుకున్నారు. విద్యార్థినులు రంగు రంగుల ముగ్గులు వేశారు. విజేతలకు బహుమతి ప్రధానం చేశారు. పాఠశాల చైర్మన్ బర్లసత్యనారాయణ, సుబ్బలక్ష్మి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

డ్రీమ్స్‌లో అంభరాన్నంటిన సంక్రాంతి సంబరాలు

రాజమహేంద్రవరంరూరల్, జనవరి 10: రాజమహేంద్రవరంరూరల్ మండలం ధవళేశ్వరంలోని డ్రీమ్స్ స్కూల్‌లో బుధవారం సంక్రాంతి సంబరాలు అంబరాన్ని అంటాయి. భోగిమంటలు, రంగవల్లులు, గోదాదేవి, హరిదాసుల వేషధారణలు, బొమ్మల కొలువు, గంగిరెద్దుల హడావిడితో డ్రీమ్స్ స్కూల్‌లో సంక్రాంతి వేడుకలు వైభంగా జరిగాయి. విద్యార్థులు, ఉపాధ్యాయులు ఎంతో ఆనందోత్సహంతో ఈ వేడుకల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో డ్రీమ్స్ చైర్మన్ అంగర రమేష్, ప్రిన్సిపాల్ ఎస్ సంధ్యాకుమారి, ఎన్ దీపిక, జి విమల రోజి, కే లలితాదేవి, అధ్యాపక అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

ఎల్ఐసీ ఉద్యోగుల మెరుపు సమ్మె

రాజమహేంద్రవరం సిటీ, జనవరి 10: వేతన సవరణ తక్షణమే చేయాలని డిమాండ్ చేస్తూ రాజమహేంద్రవరం మోరంపూడి ఎల్ఐసీ కార్యాలయం వద్ద ఉద్యోగులు ఒక గంట మెరుపు సమ్మె నిర్వహించారు. నూతన పింఛను పథకం రద్దుచేసి ఓపీఎస్ అమలు చేసేలోపు యాజమాన్యవాటాను 14శాతంకు పెంచాలని, అన్ని తరగతుల ఉద్యోగుల నియామకాలు తక్షణమే చేపట్టాలని ఉద్యోగుల జాయింట్ ఫ్రంట్ డిమాండ్ చేసింది. ఉద్యోగ సంఘం నేతలు గుబ్బల రాంబాబు, ఎం. కోదండరామ్, పి.సతీష్, ఆఫీసర్స్ నాయకులు కె.అశోక్, ప్రసాద్, ఈశ్వర్‌రావ్, సత్యదేవ్, మూథ్యూస్, శివ, జి.శ్రీనివాస్, విశ్వనాధ్, బి.శ్రీనివాసరావు, ఎస్.గన్నెయ్య, పట్నాయక్, దొరబాబు, పీఎస్‌ఎన్ రాజు, పి.సాయిబాబా, షఫీ ఉద్దీన్ పాల్గొన్నారు.




మోరంపూడి ఎల్ఐసీ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న ఎల్ఐసీ ఉద్యోగులు

సినిమా గైడ్

(రాజమహేంద్రవరం)

శ్యామల	:	డెవిల్
సూర్యామినీ	:	ఆక్వామేన్
సూర్యాప్యాలస్	:	యానిమల్
స్వామి	:	హాయ్ నాన్న
శివజ్యోతి	:	మాయాబజార్
అనుశ్రీ(సాయికృష్ణ)	:	డెవిల్
రాజా	:	సలార్
అశోక	:	సలార్
ఊర్వశి	:	డెవిల్
రంభ	:	బబుల్‌గమ్
మేనక	:	ఆక్వామేన్
అప్సర	:	కపాలదీవి
వీఎస్ మహల్ (నామవరం)	:	సలార్, డెవిల్
మురళీకృష్ణ(ధవళేశ్వరం)	:	డెవిల్
వెంకటసూర్య(కడియం)	:	సలార్,డెవిల్
సత్యగౌరి (అనపర్తి)	:	సలార్
సూర్యశ్రీ (అనపర్తి)	:	డెవిల్
ఫార్చ్యూన్ సినిమాస్(రాజానగరం)	:	డెవిల్
రామకృష్ణ(కోరుకొండ)	:	డెవిల్
గీతాసినిమాస్ (సీతానగరం)	:	హాయ్ నాన్న
శ్రీనివాస (గోకవరం)	:	డెవిల్
టీడీ సినీ మ్యాక్స్ (గోకవరం)	:	సలార్
లలితామహల్(రంపచోడవరం)	:	డెవిల్
నవయుగ(చింతూరు)	:	డెవిల్



విజయం మనదే!



విల్లును ఎక్కుపెట్టిన చంద్రబాబు



సభలో చంద్రబాబు అభివాదం

- రాబోయేది టీడీపీ, జనసేన ప్రభుత్వమే
- వైసీపీ అరాచకాలకు ప్రజలు ముగింపు పలకడం ఖాయం
- కాకినాడ జిల్లాను పారిశ్రామికంగా, పర్యాటకంగా అభివృద్ధి చేస్తా
- ఏలేరు ఆధునికీకరణ, పురుషోత్తపట్నంతోపాటు ఎత్తిపోతల పథకాలను బాగుచేస్తా
- తునిలో రా..కదలిరా బహిరంగ సభలో టీడీపీ అధినేత చంద్రబాబు
- జిల్లాలో వైసీపీ ఎమ్మెల్యేలు ద్వారంపూడి, కన్నబాబు, దాడిశెట్టి రాజా అవినీతిపై ధ్వజం
- మంచితనానికి, మర్యాదలకు తూర్పుగోదావరి పెట్టింది పేరని కొనియాడిన చంద్రబాబు
- తుని సభకు వేలల్లో జనం పోటెత్తడంతో చంద్రబాబు ఉబ్బితబ్బిబ్బు

"వైసీపీ అరాచకాలతో ప్రజలు విసుగెత్తిపోయారు. ఆ పార్టీకి బుద్ధి చెప్పడానికి ఎప్పుడు ఎన్నికలు వస్తాయా అని ఎదురుచూస్తున్నారు. రాబోయేది టీడీపీ, జనసేన ప్రభుత్వమే" అని టీడీపీ అధినేత చంద్రబాబు ధీమా వ్యక్తం చేశారు. జిల్లాను పారిశ్రామికంగా, పర్యాటకంగా అభివృద్ధి చేసి పూర్వవైభవం తెచ్చే బాధ్యత తాను తీసుకుంటానన్నారు. తునిలో బుధవారం నిర్వహించిన రా..కదలి రా!.. సభలో పాల్గొని చంద్రబాబు గంటన్నరసేపు ప్రసంగించారు. సాయత్రం 4.15 గంటలకు హెలీకాప్టర్‌లో తునికి చేరుకున్న చంద్రబాబు 5.15 గంటలకు సభా వేదికపైకి వచ్చారు. అప్పటికే వేలల్లో హాజరైన జనాన్ని చూసి ఉబ్బితబ్బిబ్బయ్యారు. జన సందోహాన్ని చూస్తుంటే టీడీపీ గెలుపు కనిపిస్తోందన్నారు. చెంతనే ఉన్న సముద్రం పొంగిందా అన్న తరహాలో వచ్చిన జనాలను చూస్తే చాలా ఆనందంగా ఉందన్నారు. ఈ సందర్భంగా తూర్పుగోదావరి జిల్లా గొప్పదనాన్ని చంద్రబాబు వివరించారు. తూర్పుగోదావరి జిల్లా అంటే మంచితనానికి, మర్యాదలకు పెట్టింది పేరు అని కొనియాడారు. అలాగే వైసీపీ నేతల అరాచకాలను మరోసారి ఆయన ఎండగట్టారు. జిల్లాలో ప్రజలందరికీ సంక్రాంతి శుభాకాంక్షలు చెప్పిన చంద్రబాబు.. సంప్రదాయాలకు చిహ్నమైన కోడి పందాలకు ఏర్పాట్లు సిద్ధమయ్యాయని, అయితే హద్దుల్లో ఉంటూనే ఆడుకోవాలని సరదాగా సూచించారు.



బాబుకు స్వాగతం పలుకుతున్న వంగలపూడి అనిత, యనమల, రాజప్ప



బహిరంగ సభలో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న చంద్రబాబు



సభలో బొకే అందిస్తున్న కాకినాడ మాజీ మేయర్ సుంకర పావని



సభలో చంద్రబాబుతో రాజేష్ మహాసేన, మాజీ ఎమ్మెల్సీ చిక్కాల



చంద్రబాబుకు పూలమాల వేస్తున్న యనమల దివ్య, శివరామకృష్ణన్

కాకినాడ(ఆంధ్రజ్యోతి)/తుని రూరల్, జనవరి 10 :

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ముగ్గురు ఎమ్మెల్యేలకు, ఓ మంత్రికి సీట్లు మార్చిన జగన్.. కాకినాడ సిటీ, కొత్తపేట, అనపర్తి ఎమ్మెల్యేలను ఎందుకు మార్చరని చంద్రబాబు ధ్వజమెత్తారు. మంత్రి దాడిశెట్టి రాజా, ఎమ్మెల్యేలు ద్వారంపూడి, కన్నబాబుల అవినీతిపై విరుచుకుపడ్డారు. బుధవారం తునిలో నిర్వహించిన రా..కదలి రా..! సభకు వేలల్లో జనం హాజరవడంతో అంతా పసుపుమయం అయింది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా తరలివచ్చిన నేతలు, కార్యకర్తలతో పండగ వాతావరణం సంతరించుకుంది. సాయంత్రం 5.15కు చంద్రబాబు బహిరంగ సభ వేదికపైకి రాగానే చప్పట్లు, కేరింతలతో టీడీపీ, జనసేన నేతలు, కేడర్ స్వాగతం పలికారు. వేలల్లో హాజరైన జనాలను చూసిన చంద్రబాబు ఆప్యాయతలకు జిల్లా మారుపేరు అని కొనియాడారు. నీతినిజాయితీకి జిల్లా పెట్టింది పేరన్నారు. పౌరుషంగా ఒక్కమాట కూడా మాట్లాడరని అన్నారు. మంచినీళ్లు ఇస్తే కొబ్బరి నీళ్లు ఇక్కడి ప్రజలు ఇస్తారన్నారు. చెంతనే అన్నవరంలో నిత్యం పూజలు, వ్రతాలతో ఈ ప్రాంతం మార్మోగుతుందని వివరించారు. వైసీపీ పాలనతో ప్రజలు విసిగిపోయారని, మంత్రి దాడిశెట్టి రాజా అక్రమాల రాజా అని ధ్వజమెత్తారు. అక్రమ సంపాదనతో ఒకచోట 132 ఎకరాలు, మరోచోట రౌతులపూడిలో 72 ఎకరాలు కొన్నారన్నారు. ఇలాంటి వసూలు రాజా అయిన మంత్రి రాజా ఎందుకు టిక్కెట్ మార్చే విషయంలో కనబడలేదని జగన్‌ను ప్రశ్నించారు. మరో ఎమ్మెల్యే ద్వారంపూడి అవినీతికి ద్వారాలు తెరిచారని, దందాల్లో ఈయన హీరో అని ఆగ్రహం వ్యక్తం చేశారు. పవన్‌ను నోటికివచ్చినట్లు తిట్టడంలో ద్వారంపూడి మీరిపోయాడన్నారు. ఇలాంటి నేతలు తిన్నదంతా తిరిగి కక్కిస్తానని హెచ్చరించారు. జగన్‌కు ద్వారంపూడి బినామీ అని, బియ్యంలో ఈయన కోట్లు గడించారన్నారు. జిల్లాలో ఏ అవినీతి జరిగినా దీనికి కేంద్ర బిందువు ద్వారంపూడేనన్నారు. ఎమ్మెల్యే కన్నబాబు మెక్కడంలో స్పీడ్‌గా ఉన్నారని, ఒకప్పుడు ఈయన జగన్‌ను తిట్టిన తిట్టు తిట్టకుండా తిట్టి ఇప్పుడు తెగ పొడుగుతున్నారన్నారు. బతకనేర్చిన కన్నబాబు అవినీతిలో లెక్కలేనంతగా సంపాదించాడని ఆరోపించారు. జగ్గంపేట, ప్రత్తిపాడు, పిఠాపురం ఎమ్మెల్యేలను జగన్ మార్చేశారని, ఓ మంత్రిని జిల్లా దాటించేశారన్నారు. ప్రజలు కూడా సీఎం జగన్‌ను ఇంటికి పంపించడం ఖాయం అన్నారు. వైసీపీ పాలనలో జిల్లా సాగునీటి రంగం తీవ్రంగా దెబ్బతిందని ధ్వజమెత్తారు. టీడీపీ వచ్చాక ఏలేరు ఆధునికీకరణ, పురుషోత్తపట్నం, ఎత్తిపోతల పథకాలను తిరిగి గాడినపెడతామని ప్రకటించారు. జిల్లాలో సముద్రజల కాలుష్యంపై మత్స్యకారులు ఫిర్యాదుచేశారని, ఆ సమస్య పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. జిల్లాలో తీరంతో పాటు సెజ్, రెండు పోర్టులు ఉన్నాయని, పెట్రోకాంప్లెక్స్ కూడా వస్తే పారిశ్రామికంగా వృద్ధి చెందుతుందన్నారు. పర్యాటకరంగాన్ని కూడా ప్రోత్సహించి జిల్లాకు పూర్వవైభవం తెస్తానన్నారు. కాగా చంద్రబాబుకు టీడీపీ నేతలు వెండి గద, బాణం అందించారు. కార్యక్రమంలో మాజీ మంత్రులు యనమల రామకృష్ణుడు, బండారు సత్యనారాయణ, రాజప్ప, గొల్లపల్లి, ఎమ్మెల్యే గోరంట్ల, మాజీ ఎమ్మెల్యేలు నెహ్రూ, వనమాడి, వర్మ, రామకృష్ణారెడ్డి, వంగలపూడి అనిత, బండారు సత్యానందం, దాట్ల బుచ్చిబాబు, పిల్లి అనంతలక్ష్మి, జిల్లా పార్టీ అధ్యక్షుడు నవీన్, ప్రత్తిపాడు, తుని, రాజానగరం ఇన్‌చార్జులు వరుపుల సత్యప్రభ, దివ్య, బొడ్డు వెంకటరమణ, మాజీ ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు, అమలాపురం నియోజకవర్గ పరిశీలకుడు ముదునూరి మురళీకృష్ణంరాజు, మండలి మాజీ డిప్యూటీ చైర్మన్ రెడ్డి సుబ్రహ్మణ్యం, కటకంశెట్టి బాబి, పేరాబత్తుల రాజశేఖర్, వాసిరెడ్డి ఏసు దాసు, టీడీపీ సీనియర్ నేత గుణ్ణం చంద్రమౌళిలు పాల్గొన్నారు.

మూడు నెలల్లో దశ, దిశ చూపిస్తాం

సూర్యుడు తూర్పున ఉదయించి ఏ విధంగా అందరికీ వెలుగునిస్తాడో.. అలా టీడీపీ, జనసేన కూడా మూడు నెలల్లో ప్రభుత్వ బాధ్యత తీసుకుని దశ, దిశ చూపిస్తామని చంద్రబాబు స్పష్టంచేశారు. ఒక విజనరీ ఉండాలి. ఆ రోజుల్లో కాటన్.. ధవళేశ్వరం బ్యారేజీ కట్టాడు. అతడు విదేశీయుడైనా గోదావరి జిలాల్లో ఏ మూలకు వెళ్లినా ఆయన విగ్రహాలు పెట్టారు. అదీ మీ మంచితనం. మీకు మేలు చేస్తే అలా చూసుకుంటారు. కానీ ఇక్కడ వైసీపీ నేతలు మెక్కిందంతా కక్కిస్తామని టీడీపీ అధినేత చంద్రబాబు హెచ్చరించారు. కాగా జగన్ ప్రతిపక్షంలో ఉండగా ఇచ్చిన మోసపూరిత హామీల వీడియోను సభా వేదికపై భారీ స్క్రీన్‌పై చంద్రబాబు ప్రదర్శించారు. మద్య నిషేధం చేస్తానని, సీపీఎస్ వారంలోనే రద్దు చేస్తానని, ప్రత్యేక హోదా తీసుకువస్తానని, పోలవరం 2021, 2022, 2023, 2025కల్లా పూర్తిచేస్తానని జగన్ ప్రసంగాలను ప్రదర్శించి.. బాబు ప్రశ్నల వర్షం కురిపించారు. జై చంద్రబాబు, జై పవన్‌కల్యాణ్.. సైకో పోవాలి సైకిల్ రావాలంటూ సభా ప్రాంగణం నినాదాలతో హోరెత్తింది. బాబు ప్రసంగానికి కార్యకర్తలు ఉత్సాహంతో స్పందించారు.





తునిలో జరిగిన రా.. కదలి రా..! బహిరంగ సభకు హాజరైన అశేష జనావళి.. సభలో వేదికపై మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు, మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు, నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జులు, ఇతర నేతలు ఉన్న దృశ్యం

రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో వెనక్కి నెట్టిన జగన్

వైసీపీ పాలనలో రాష్ట్రం అన్ని రంగాల్లో వెనుకబడి ఉంది. టీడీపీ పాలనలో దేశంలో రాష్ట్రం అభివృద్ధి మొదటి 5 స్థానాల్లో ఉండగా వైసీపీలో చివరి 5 స్థానాల్లోకి దిగజారింది. రాష్ట్రంలో ఎన్ని ఇబ్బందులు ఉన్నా సంపదను సృష్టించి రాష్ట్రాన్ని గాడినపెట్టగల సమర్థుడు చంద్రబాబు. భవిష్యత్ తరాలకు టీడీపీ, జనసేన ప్రభుత్వం ఎంతో అవసరం.

- యనమల రామకృష్ణుడు,
రాష్ట్ర పొలిట్ బ్యూరో సభ్యుడు



బటన్‌నొక్కి జగన్‌ను ఇంటికి పంపిద్దాం

జనాలను మోసం చేస్తున్న జగన్‌ను ఈవీఎం బటన్ నొక్కి ఇంటికి పంపిద్దాం. రాష్ట్ర ప్రజలు టీడీపీ, జనసేన విజయాన్ని కోరుకుంటున్నారు. ఇరుపార్టీల మైత్రితో మన విజయం సాధిస్తాం.

- నిమ్మకాయల చినరాజప్ప,
పెద్దాపురం ఎమ్మెల్యే

జనసేన, టీడీపీ సంయుక్త పోరాటం

జనసేన, టీడీపీ సంయుక్త పోరాటంతోనే వైసీపీ ఓటమి సాధ్యం. 45 వసంతాల రాజకీయ చరిత్ర.. ఉమ్మడి రాష్ట్రంలో సుదీర్ఘకాలం సీఎంగా పనిచేసిన చంద్రబాబుకు, మంచి స్టార్డమ్ ఉన్న జనసేన అధ్యక్షుడు పవన్‌కల్యాణ్‌లకు పదవులు ముఖ్యంకాదు.. రాష్ట్ర ప్రజల సంక్షేమం, శ్రేయస్సు కోసమే ఇరుపార్టీలు ఒక్కటయ్యాయి. రాష్ట్ర సైకో పాలనను అంతం చేసేందుకు చంద్రబాబు, పవన్ కలయిక తప్పనిసరి. రాష్ట్ర భవిష్యత్ కోసమే జనసేన అధినేత పొత్తు పెట్టుకున్నారు. ఇరుపార్టీలు సమన్వయంతో పనిచేసి సుపరిపాలనకు నాంది పలుకుదాం.

- కందుల దుర్గేష్, ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా జనసేన ఇన్‌చార్జి

జిల్లా వైసీపీలో గందరగోళం

- తానేటి వనితకు డౌట్?
- తాడేపల్లి వెళ్లిన మద్దతుదారులు
- జిల్లాలో అధికారికంగా ఇద్దరే ఖరారు
- మిగతా వారిని ఇంకా ప్రకటించకపోవడంతో అనుమానాలు
- కొవ్వూరులో వైసీపీలో రెండు వర్గాలు
- పార్టీ గ్రూపులో ఒకరిపై ఒకరు ఆరోపణలు
- ఆమె గోపాలపురం నేతలతో టచ్‌లో ఉన్నట్టు ప్రచారం
- సీఎం క్యాంపు ఆఫీస్‌కు జక్కంపూడి వెళ్లడంపైనా చర్చ

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

జిల్లా వైసీపీలో తీవ్ర గందరగోళం నెలకొంది. రాష్ట్ర హోంమంత్రి తానేటి వనిత టికెట్‌కు ఒక వర్గం చెక్ పెడుతుందనే అనుమానంతో బుధవారం ఆమె మద్దతుదారులు తాడేపల్లి పెద్దల వద్ద తేల్చుకోవడానికి వెళ్లారు. కానీ సాయంకాలం వరకూ ఏమీ తేలలేదు. జిల్లాలో ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలు, ఒక లోక్‌సభ నియోజకవర్గమూ ఉన్న సంగతి తెలిసిందే. ఇప్పటికే రాజమహేంద్రవరం రూరల్ నుంచి రాష్ట్ర మంత్రి చెల్లుబోయిన వేణు పేరును, రాజమహేంద్రవరం అర్బన్ నుంచి ఎంపీ మార్గానిభరత్ పేరును ఖరారు చేసిన సంగతి తెలిసిందే. వారేమో అసంతృప్తులతోనూ, అసమ్మతివర్గంతోనూ ఎలా గట్టెక్కాలని, అవకాశాలను కోల్పోయినా సీటీ, రూరల్ కోఆర్డినేటర్లు గూడూరి శ్రీనివాసరావు, చందన నాగేశ్వర్‌ను ఎలా బుజ్జగించాలో ఆలోచిస్తూ తమ ప్రచారం చేసుకుంటున్నారు. పైకి అంతా బాగానే ఉన్నా, లోలోపల వర్గాలు కుతకుతలాడిపోతున్నారు. ఇక కొందరికి వెళ్లి పనిచేసుకోమని చెప్పారే కానీ, అధికారికంగా ఇంకా ప్రకటించలేదు. అనపర్తి, రాజానగరం, కొవ్వూరు, గోపాలపురం, నిడదవోలు అభ్యర్థులను ఇంకా అధికారికంగా ప్రకటించలేదు. ఈ పరిస్థితుల్లో కొందరిలో టెన్షన్ మొదలైంది. వైసీపీ అధినేత జగన్ వైఖరి చూస్తుంటే ఏక్షణంలో ఎవరిని ఎక్కడ పోటీ పెడతారో, ఎవరి స్థానానికి ఎసరు పెడతారో అర్థం కాకుండా పోయింది. ఈ భయం కొందరి నేతల్లో ఊపిరాడకుండా చేస్తోంది. ప్రస్తుతం రాష్ట్ర హోంశాఖ మంత్రి తానేటి వనిత పరిస్థితి ఇలానే ఉంది. జిల్లాలో రెండోసారి కూడా ఆమెకు మంత్రి పదవి లభించింది. జగన్‌కు ఆమె సన్నిహితంగా ఉంటారనే ప్రచారం ఉన్నా ఇవాళ భయానికి లోనవుతున్నట్టు అర్థమవుతోంది. ఆమెకు మద్దతుగా బుధవారం కొంతమంది తాడేపల్లి వెళ్లారు. మిథున్‌రెడ్డితో మంతనాలు జరిపారు. కానీ స్పష్టత లేదు. పైగా ఈ నియోజకవర్గం వైసీపీ వాట్సాప్ గ్రూపులో తీవ్ర వాగ్వాదాలు జరుగుతున్నట్టు మెసేజ్‌లు బయటకు వచ్చాయి. వనితమ్మకే మళ్లీ టికెట్ అని, ఆమెను గెలిపిస్తామని కొందరు, ఆమెకు మళ్లీ సీటు రాకుండా కుట్ర జరుగుతోందని కొందరు, ఒక సామాజికవర్గం ఆమెను రెండోసారి రానీయకుండా ప్రయత్నిస్తుందని మరికొందరు రకరకాలుగా వాదించుకుంటున్నారు. ఇటీవల వనిత గోపాలపురం వైసీపీ నేతలతో మాట్లాడుతూ తాను గోపాలపురం వస్తున్నానని చెప్పారని, ముందు ఆమె ఎక్కడ పోటీ చేద్దామనుకుంటున్నారో తేల్చుకోమని కొందరు ప్రశ్నిస్తున్నారు. ఇక్కడ సామాజిక వర్గాలు ఆధిపత్యపోరు కూడా నడుస్తోంది. అసలు ఆమెకు మళ్లీ టికెట్ ఇస్తారా, ఇస్తే ఎక్కడి నుంచి పోటీ చేస్తారనేది అయోమయంగా ఉంది. మంత్రి వనితకు మద్దతుగా బుధవారం కొందరు నేతలు తాడేపల్లి వెళ్లగా మంత్రి మాత్రం కొవ్వూరులోనే ఉన్నారు. మరోవైపు బుధవారం రాత్రికే కొందరి జాబితా ప్రకటిస్తారనే ప్రచారం జరిగింది. పండగ వెళ్లేవరకూ ఈ జాబితా ప్రకటన వాయిదా వేసినట్టు సమాచారం. దీంతో మరింత టెన్షన్ తప్పదు. కాగా రాజానగరం ఎమ్మెల్యే జక్కంపూడి రాజా బుధవారం సీఎం క్యాంపు ఆఫీసుకు వెళ్లారనే సమాచారం తాజాగా చర్చనీయాంశంగా మారింది. ఇక రాజమహేంద్రవరం వైసీపీ అభ్యర్థి విషయంలో కూడా అయోమయం నెలకొంది. ఎంపీ మార్గాని భరత్‌ను రాజమహేంద్రవరం సిటీకి పంపడంతో ఈ స్థానం ఖాళీ అయింది. ఇప్పటికే పలువురు బీసీ నేతలు తమకే ఈ స్థానం కేటాయించారని చెప్పుకుంటున్నారు. బీసీలలో డాక్టర్ అనుసూరి పద్మలత, విద్యావేత్త బర్ల విజయ్ యాదవ్, డాక్టర్ గూడూరి శ్రీనివాస్‌లు ఇప్పటికే అధిష్ఠానాన్ని కలిసినట్టు ప్రచారం జరుగుతోంది. జనరల్ కేటగిరీ నుంచి సినీ దర్శకుడు వీవీ వినాయక్ పేరు.. ప్రభుత్వ సలహాదారు రాజీవ్‌కృష్ణ పేరు కూడా పరిశీలనలో ఉన్నట్టు చెబుతున్నారు.



ఆర్‌డీ కార్యాలయం వద్ద ఆర్‌డీకి వినతిపత్రం అందిస్తున్న నాయకులు

సమ్మె విషయంలో ప్రభుత్వం పంతాలు మానుకోవాలి

ఆర్‌డీ కార్యాలయాన్ని ముట్టడిలో ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు

రాజమహేంద్రవరం సిటీ, జనవరి10: మునిసిపల్ కార్మికుల సమ్మె విషయంలో ప్రభుత్వం తన పంతాన్ని మానుకుని సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు రావులపల్లి రవీంద్రనాథ్ అన్నారు. రాజమహేంద్రవరంలో బుధవారం మునిసిపల్ కార్మిక జేఏసీ ఆధ్వర్యంలో మునిసిపల్ ఆర్‌డీ కార్యాలయాన్ని కార్మికులు ముట్టడించారు. దీనిలో పాల్గొని రవీంద్రనాథ్ మాట్లాడుతూ గత 9 రోజులుగా రాష్ట్రవ్యాప్తంగా కార్మికులు సమ్మె చేస్తున్నా ప్రభుత్వంలో చలనం లేకపోవడం దారుణమన్నారు. ముఖ్యమంతి జగన్ తన పంతాన్ని వీడితే మంచిదన్నారు. సమస్యలు పరిష్కరించకపోతే మునిసిపల్ కార్మికులంటే ఏమిటో చూపిస్తారన్నారు. వచ్చే ఎన్నికల్లో ఓటు అనే ఆయుధంతో బుద్ధిచెప్పడానికి అందరు సిద్ధంగా ఉన్నారని చెప్పారు. మునిసిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు నెక్కంటి సుబ్బారావు మాట్లాడుతూ చలో ఆర్‌డి కార్యాలయానికి ఉదయం నుంచి నాలుగు జిల్లాల నుంచి మునిసిపల్ కార్మికులు ఆధ్వర్యంలో కార్మికులు పెద్దఎత్తున తరలివచ్చారని చెప్పారు. అనంతరం ఆర్‌డీకి వినతిపత్రం అందించారు. యూనియన్ నేతలు భజంత్రీ శ్రీనివాస్, తడికొండ వాసు, కె మల్లేశ్వరరావు, జిల్లా గౌరవ అధ్యక్షుడు తాటిపాక మధు, ఏఐటీయూసీ నేతలు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



రౌండు టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న కందుల దుర్గేష్

అంగన్వాడీల సమస్యలు పరిష్కరించాలి

రౌండు టేబుల్ సమావేశంలో నాయకులు డిమాండ్

రాజమహేంద్రవరం అర్బన్, జనవరి 10: అంగన్వాడీల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని పలు రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాలు, ఉపాధ్యాయ, దళిత సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం రాజమహేంద్రవరం సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట అంగన్వాడీల నిరవధిక సమ్మె శిబిరంలో రాజకీయపార్టీలు, కార్మిక, ఉద్యోగ సంఘాలు, ప్రజాసంఘాల రౌండు టేబుల్ సమావేశం జరిగింది. సీపీఎం నగర కార్యదర్శి టి.పవన్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడు కందుల దుర్గేష్ మాట్లాడుతూ ఎన్నికలకు ముందు జగన్మోహనరెడ్డి ఇచ్చిన హామీలు అమలుచేయాలని అంగన్వాడీలు కోరుతుంటే వారిపై నిర్బంధం ప్రయోగించడం విడ్డూరంగా ఉందని అన్నారు. అంగన్వాడీల పోరాటానికి జనసేన పార్టీ సంపూర్ణ మద్దతు తెలుపుతున్నదని పేర్కొన్నారు. తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు ఆదిరెడ్డి అప్పారావు మాట్లాడుతూ అక్క చెల్లమ్మలంటూ ఓట్లు దండుకున్న జగన్‌కు రాష్ట్రంలో 30 రోజులుగా సమ్మె చేస్తూ రోడ్ల మీద పోరాటాలు చేస్తున్న అంగన్వాడీలు కనబడలేదా అని ప్రశ్నించారు. ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా కోశాధికారి ఎం.వెంకటలక్ష్మి, కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి దేవత సుధాకర్, సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు జువ్వల రాంబాబు, సీపీఐఎంఎల్ న్యూ డెమాక్రసీ జిల్లా నాయకులు జోజి, సీపీఐ రాజమహేంద్రవరం నగర కార్యదర్శి వి.కొండలరావు పాల్గొన్నారు.

కోట సత్తెమ్మ ఆలయంలో హుండీ లెక్కింపు

● సుమారు 105 రోజులకు రూ.28,07,946 ఆదాయం


తిమ్మరాజుపాలెంలోని కోటసత్తెమ్మ ఆలయంలో హుండీలను లెక్కిస్తున్న దృశ్యం

నిడదవోలు, జనవరి 10: నిడదవోలు మండలం తిమ్మరాజుపాలెం గ్రామంలో ఉన్న కోటసత్తెమ్మ అమ్మవారి దేవస్థానంలో బుధవారం దేవదాయ ధర్మాదాయ శాఖ అధికార్ల పర్యవేక్షణలో హుండీల లెక్కింపు కార్యక్రమం నిర్వహించారు. 27-09-2023 నుంచి 09-01-2024 వరకు సుమారు 105 రోజులకుగాను హుండీల ద్వారా నగదు రూ.28,07,946 ఆదాయం లభించగా అన్నదాన ట్రస్ట్ హుండీ ద్వారా రూ.68,095 లభించగా 024 గ్రాముల బంగారం, 250 గ్రాముల వెండి, విదేశీ కరెన్సీ లభించినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి బళ్ల నీలకంఠం తెలిపారు. ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్ అండ్ చైర్మన్ దేవులపల్లి రవిశంకర్, ధర్మకర్తల మండలి సభ్యులు గాజుల రంగారావు, అయినీడి వెంకటకృష్ణ, పలువురు సభ్యులు ఆలయ సిబ్బంది సత్యసాయి సేవా సంస్థల సభ్యులు తదితర్లు పాల్గొన్నారు. పర్యవేక్షణ అధికారిగా దేవదాయ ధర్మాదాయ శాఖ తనిఖీదారు ఎ.సుజన్‌కుమార్ పాల్గొన్నారని ఆలయ కార్యనిర్వహణాధికారి తెలిపారు.

నిడదవోలులో కిక్ బాక్సింగ్ ఎంపిక పోటీలు


కిక్ బాక్సింగ్ ఎంపిక పోటీలు జరుగుతున్న దృశ్యం

నిడదవోలు, జనవరి 10: నిడదవోలు పట్టణంలోని ఎస్వీఆర్కే డిగ్రీ కళాశాలలో బుధవారం ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం స్థాయిలో వివిధ కళాశాలలకు చెందిన విద్యార్థులకు కిక్ బాక్సింగ్ ఎంపిక పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో ఎంపికైన క్రీడాకారులు జాతీయ విశ్వవిద్యాలయాలస్థాయి టోర్నమెంటులో పాల్గొంటారని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జ్యోతి తెలిపారు. ఈ పోటీలలో ఎమ్.రవి, ఎస్వీఆర్కే నిడద వోలు, బి.అర్జున్, ఆదిత్య డిగ్రీ కాలేజ్ రాజమహేంద్రవరం, బి.ప్రవీణ్ కుమార్, డిఆర్కే డిగ్రీ కాలేజ్, గొల్లల మామిడాడ, సీహెచ్ వెంకట్, పీఆర్ గవర్నమెంటు డిగ్రీ కాలేజ్, కాకినాడ, బి.రవితేజ, విఎస్ఎమ్ డిగ్రీ కాలేజ్, రామచంద్రపురం, పి.ధనుష్, పిఆర్ గవర్నమెంటు డిగ్రీ కాలేజ్, కాకినాడ, సీహెచ్ దినేష్, గవర్నమెంటు డిగ్రీ కాలేజ్, రాజోలు క్రీడాకారులు ఎంపికయ్యారు.

గ్రామాల్లో కోడి పందాలు నిషేధం

● కొవ్వూరు తహసీల్దార్ నాగరాజనాయక్


కోడి పందాలు నిషేధంపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

కొవ్వూరు, జనవరి 10 : కొవ్వూరు పట్టణ, మండలంలో కోడి పందాలను నిషేధించినట్లు కొవ్వూరు తహసీల్దార్ బి.నాగరాజనాయక్ తెలిపారు. హైకోర్టు ఉత్తర్వులను అనుసరించి కొవ్వూరు పట్టణ పోలీస్టేషన్ పరిధిలోని వాడపల్లి గ్రామంలో, మండలంలోని తోగుమ్మి, పంగిడి గ్రామాలలో బుధవారం కోడి పందాలు నిషేదంపై ప్రజలకు అవగాహన సదస్సు నిర్వహించారు. తహసిల్దార్ నాగరాజు నాయక్ మాట్లాడుతూ సంక్రాంతి పండుగను పురస్కరించుకుని గ్రామాలలో కోడి పందాలు, గుండాట, పేకాట వంటి జూద క్రీడలను నిషేధించామన్నారు. మండలంలోని గ్రామాలలో గ్రామసభలు నిర్వహించి అవగాహన సదస్సులు ఏర్పాటుచేస్తున్నామన్నారు. మండలంలోని అన్ని గ్రామాలలో ఈనెల 9వ తేదీ నుంచి 25 వరకు 144 సీఆర్‌పీసీ అమలులో ఉంటుందన్నారు. కోర్టు ఆదేశాలను ఉల్లంఘించి జూద క్రీడలు, కోడి పందాలు నిర్వహించినట్లయితే చట్ట ప్రకారం చర్యలు తప్పవన్నారు. కార్యక్రమంలో పట్టణ సీఐ వి.జగదీశ్వరరావు, ఎస్ఐ జి.సతీష్, రెవెన్యూ, పంచాయతీ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

దేవరపల్లి: మండలంలోని మూడు గ్రామ పంచాయతీల పరిధిలో కోడిపందాలు నిర్వహించే ప్రాంతాలను గుర్తించామని ఆర్ఐ కే.వెంకటేశ్వరరావు అన్నారు. బుధవారం కోడిపందాలు వేసే బరులను గుర్తించి ఆ ప్రాంతాల్లోని రైతులకు, కోడిపందాలు నిర్వహిస్తే కఠినచర్యలు తీసుకుంటామని, కోడిపందాలు ఆడటానికి బరులు తయారు చేసిన స్థలం ఇచ్చి పందాలకు ప్రోత్సహించిన స్థల యజమానులపై చట్టరీత్యా చర్యలు ఉంటాయన్నారు. పేకాట, గుండాట, ఇతర అసాంఘిక కార్యక్రమాలు నిర్వహించిన కఠినచర్యలు తప్పవని ఆర్ఐ అన్నారు. కార్యక్రమంలో పోలీస్ అధికారులు, పశుసంవర్ధక శాఖాధికారులు, వ్యవసాయ శాఖాధికారులు పాల్గొన్నారు.

సెయింట్ క్లారెట్ స్కూల్ బాలల అంగడి

● 107 స్టాల్స్‌ను ఏర్పాటు చేసిన విద్యార్థులు


బాలల అంగడిలో కొనుగోలు చేస్తున్న విద్యార్థులు, వినియోగదారులు

నల్లజర్ల, జనవరి 10: విద్యార్థులను కేవలం క్లాసు రూము బోధన, పాఠ్యాంశాలే కాకుండా పిల్లల సర్వతోముఖాభివృద్ధికి (అల్ రౌండ్ డెవలెప్‌మెంట్)అవసరమైన నైపుణ్యాలు పెంపొందించే విధంగా విద్యార్థుల చేత బాలల అంగడి ఏర్పాటు చేసినట్లు సెయింట్ క్లారెట్ ప్రిన్సిపాల్ జోషప్ శాంతప్ప పేర్కొన్నారు. బుధవారం నల్లజర్ల సెయింట్ క్లారెట్ హైస్కూల్‌లో విద్యార్థుల చేత అంగడి ఏర్పాటు చేశారు. నిత్యావసర వస్తువులు, బిర్యానీ, పండ్లు, కూరగాయలు, పుస్తకాలు, పెన్నులు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు, ఫ్యాన్సీ, ఐస్‌క్రీం వంటి దుకాణాలు విద్యార్థులు ఏర్పాటుచేసి వినియోగదారులకు విక్రయించారు. క్లాసు రూము చదువులు నిజ జీవితంలో ఏలా ఉపయోగపడుతుందో, వ్యాపార లావాదేవీలు అన్నీ విద్యార్థులే చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ నేటి సమాజంలో ప్రతి వ్యక్తి నిత్య వినియోగదారుడేనని ఆర్థిక వ్యవహారంలో పిల్లలు కూడా కేంద్ర బిందువులుగా ఉంటున్నారని, విద్యార్థులు బయట మార్కెట్‌లో మోసపోకుండా వస్తువుల ధరలు, వాటికి అమ్మకందారుడు లాభం వంటి అంశాలు తెలుసుకుంటారని ఇటువంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. మానవత సంస్థ జిల్లా కన్వీనర్ కండెపు సూర్యనారాయణ, పాదర్ జయరాజు, బ్రదర్‌కుమార్, వర ప్రసాద్, ఐడీవీ అప్పారావు పాల్గొన్నారు.

తెల్లదోమ నివారణకు జాగ్రత్తలు పాటించాలి

చాగల్లు, జనవరి 10 : కొబ్బరి, పామాయిల్ తోటల్లో రూగోస్ తెల్లదోమ వ్యాప్తి చెందకుండా రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని శాస్త్రవేత్త, డాక్టర్ చలపతి తెలిపారు. బుధవారం మండలంలోని కలవలపల్లిలో కొబ్బరి పరిశోధన కేంద్రం అంబాజీపేట వారి ఆధ్వర్యంలో ఈకొబ్బరి, పామాయిల్ రైతులకు, +ఆర్బీకే సిబ్బందికి తెల్లదోమపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఉద్యానశాఖ కొవ్వూరు వారి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో కీటక శాస్త్రవేత్త చలపతి మాట్లాడుతూ ఇటీవల వాతావరణంలో వచ్చిన మార్పుల వలన తెల్లదోమ వ్యాప్తి అవుతుందన్నారు. జిల్లాఉద్యాన అధికారి సుజాత మాట్లాడుతూ వ్యాధి నివారణ చర్యలు ముందుగా తీసుకుంటే వ్యాధి వ్యాప్తిని అరికట్టవచ్చునన్నారు. ఈకార్యక్రమంలో అంబాజీపేట కొబ్బరి పరిశోధన శాస్త్రవేత్తలు, రైతులు, ఉద్యానవన అధికారులు పాల్గొన్నారు.

ఇంటింటికీ మేనిఫెస్టోలు పంపిణీ

తాళ్లపూడి, జనవరి 10: మండలంలోని తాడిపూడి గ్రామంలో జనసేన నాయకులు, టీడీపీ నాయకులు ఉమ్మడి ప్రచారంలో భాగంగా బుధవారం ఇంటింటికీ గాజుగ్లాసులు, ఉమ్మడి మేనిఫెస్టోలను పంపిణీ చేశారు. రాష్ట్రంలో జగనన్న పాలనకు చరమగీతం పాడాల్సిన సమయం ఏర్పడిందని రాష్ట్ర ప్రజల బంగారు భవిష్యత్తుకు టిడిపి, జనసేన పార్టీలు చేస్తున్న ఉమ్మడి ఎన్నికల పోరాటంలో ప్రజలంతా కలిసి రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కాకర్ల సత్యేంద్ర, ముప్పిడి బుషిరాజు, చెట్టే సుభాషిణి, గంటా కృష్ణ, కొప్పాక విజయ్ కుమార్, కూచిపూడి గణేష్, తొండెపు భరత్ తదితర టిడిపి, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

16వ రోజుకు ఔట్ సోర్సింగ్ కార్మికుల సమ్మె

కొవ్వూరు, జనవరి 10 : కొవ్వూరు మున్సిపల్ కార్యాలయం ఎదుట మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఔట్ సోర్సింగ్ కార్మికులు 16వ రోజు సమ్మెను కొనసాగించారు. ఔట్ సోర్సింగ్ కార్మికులను రెగ్యులర్ చేయాలని, ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. మున్సిపాల్టీలలో పనిచేస్తున్న అన్ని విభాగాల కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాజాన అప్పారావు, బి.రవీంద్ర, మీసాల కిషోర్, కళ్యాణి రాజేష్, మీసాల ప్రేమ్, పూజారి వాసు, కారింకి ప్రసాద్, మీసాల జ్యోతి, ముత్యాల శ్రీను, వద్దాది శ్యాం, అల్లం విజయకుమార్ పాల్గొన్నారు.


కొవ్వూరు సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీలు



గోపాలపురం, దేవరపల్లిలో 30 అంకె ఆకారంలో నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీలు

అంగన్‌వాడీలకు షోకాజ్ నోటీసులు

● నోటీసులు స్వీకరించడానికి నిరాకరణ
● 30వ రోజు కొనసాగిన సమ్మె

కొవ్వూరు, జనవరి 10 : అంగన్‌వాడీలకు సచివాలయ కార్యదర్శులు షోకాజ్ నోటీసులు అంటించారు. బుధవారం కొవ్వూరు పట్టణంలో సమ్మెచేస్తున్న అంగన్‌వాడీలకు రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలమేరకు ఐసీడీఎస్ జిల్లా ప్రాజెక్టు అధికారిని జారీచేసిన షోకాజ్ నోటీసులను వీఆర్వో, సచివాలయ అడ్మిన్ సెక్రటరీ, మహిళా పోలీసులు కలిపి అందజేసే ప్రయత్నం చేశారు. అంగన్‌వాడీలు సమ్మె నోటీసు స్వీకరించడానికి నిరాకరించారు. దీంతో అధికారుల ఆదేశాల మేరకు షోకాజ్ నోటీసును సంబంధిత అంగన్‌వాడీ కేంద్రం వద్ద, వర్కర్, హెల్పర్స్ ఇంటి గోడలకు అంటిస్తున్నారు. అంగన్‌వా డీ కార్యకర్తలు 11 డిమాండ్లతో 2023 డిసెంబరు 12వ తేదీ నుంచి నిరవధిక సమ్మె చేపట్టారు. దీనిపై మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమశాఖ ముఖ్య కార్యదర్శి, మంత్రులు యూనియన్ నాయకులతో చర్చించి కొన్ని డిమాండ్లను అంగీకరించి, జీవోలను విడుదల చేసింది. సమ్మె విరమించాలని ప్రభుత్వం కోరినప్పటికీ అంగన్‌వాడీలు సమ్మె విరమించక పోవడంతో రాష్ట్ర వ్యాప్తంగా 7 నెలల నుంచి 6 సంవత్సరాల లోపు చిన్నారులకు, గర్భిణులకు, బాలింతలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. దీంతో రాష్ట్ర ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందించాల్సిన సేవలను ఎస్మా చట్టం పరిధిలోకి చేర్చి షోకాజ్ నోటీసును జారీ చేసింది. ప్రభుత్వం ప్రాథ మికంగా కొన్ని డిమాండ్లను ఆమోదం తెలిపి, మిగిలిన కోరికలు పరిష్కారానికి ప్రయత్నాలు చేస్తున్నప్పటికీ అంగన్‌వాడీలు విధులకు గైర్హాజరై ఉద్యోగ బాధ్యతలను విస్మరించడంపై ఎందుకు ఉద్యోగాల నుంచి తొలగించకూడదు అని షోకాజ్ నోటీసును జారీ చేసింది. నోటీసు అందిన 10 రోజులలో సంజాయిషి ఇవ్వాలని, లేనిచో కాలవ్యవధి ముగిసిన తరువాత శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని నోటీసులు పొందుపర్చారు. ఇప్పటికే అలుపు సలపని బాధ్యతలను ఉక్కిరిబిక్కిరి అవుతున్న సచివాలయ కార్యదర్శులకు అంగన్‌వాడీలకు షోకాజ్ నోటీసులు అందించే బాధ్యతలను అప్పగించడంపై అసహనాన్ని వ్యక్తం చేస్తున్నారు. షోకాజ్ నోటీసులు అందించడానికి తమతో పాటు సహకరించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు కోరితే మాకు ఖాళీలేదని బదులు ఇస్తున్నారని సచివాలయ కార్యదర్శులు వాపోతున్నారు. ఇదేవిధంగా అదనపు బాధ్యతలను తమపై రుద్దితే తాము కూడా ఆందోళన బాట పట్టక తప్పదని సచివాలయ కార్యదర్శులు వాపోతున్నారు.


కొవ్వూరులో అంగన్‌వాడీ కేంద్రాలకు షోకాజ్ నోటీసులు అందజేస్తున్న సచివాలయ కార్యదర్శులు, తాళ్లపూడిలో గోడలకు అంటించిన షోకాజ్ నోటీసులు

ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలి

రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను తక్షణం అమలుచేయాలని అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు సీహెచ్. మాణిక్యాంబ అన్నారు. కొవ్వూరు సబ్‌కలెక్టర్ కార్యాలయం ఎదుట 30వ రోజు అంగన్‌వాడీలు సమ్మెను కొనసాగించారు. ముఖ్యమంత్రి ఇచ్చిన హామీలు, సుప్రీంకోర్టు తీర్పుమేరకు గ్రాట్యూటీ అమలు చేయాలని నినాదాలు చేశారు. ప్రగతిశీల అంగన్‌వాడీ వర్కర్స్ నాయకురాలు మంగతాయారు మాట్లాడుతూ కనీస వేతనాలు, గ్రాట్యూటీ ఇవ్వకపోతే ఆకలితో అయిన చస్తాం కానీ విధులకు హాజరుకాబోమన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీలు సీహెచ్ పుష్పావతి, సుబ్బలక్ష్మి, ఎ.నరసమాంబ, బి.పద్మజ, బి.వసంత, డి.అమరావతి, సీహెచ్. బ్రహ్మమ్మ, వి. శ్రీదేవి, చిన్న లక్ష్మి, ఎం. మంగతాయారు పాల్గొన్నారు.

తాళ్లపూడి: తాళ్లపూడి మండలంలోని అంగన్‌వాడీ కార్యకర్తలకు, ఆయాలకు ప్రభుత్వ అధికారులు బుధవారం షోకాజ్ నోటీసులు పంపించారు. గత కొన్నిరోజులుగా అంగన్‌వాడీలు నిరవధిక సమ్మెలు చేయడం విధితమే. బుధవారం అంగన్‌వాడీలు కొవ్వూరులో సమ్మె చేస్తుండడంతో తాళ్లపూడి మండలంలోని అంగన్‌వాడీలు అందుబాటులో లేకపోవడంతో అంగన్‌వాడీ కేంద్రాలవద్ద గోడలకు, నోటీసులు అంటించారు. అంగన్‌వాడీ సేవలు అత్యవసర సర్వీసులుగా పరిగణిస్తూ వీరంతా సమ్మెలోంచి బయటకు రావాలని 10రోజుల్లో విధులలో చేరాలని లేని పక్షంలో చట్టపరమైన చర్యలు ఉంటాయని నోటీసుల్లో పేర్కొన్నారని అంగన్‌వాడీ కార్యకర్తలు తెలిపారు.

చాగల్లు: స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద అంగన్‌వాడీ కార్యకర్తలు చేస్తున్న నిరవధిక నిరసన కార్యక్రమం బుధవారం కొనసాగింది. ప్రభుత్వం తమ డిమాండ్‌లు నెరవేర్చే వరకు నిరసన కార్యక్రమాలు కొనసాగుతాయని తెలిపారు. ఈకార్యక్రమంలో అంగన్‌వాడీ హెల్పర్‌లు, వర్కర్లు యూనియన్ నాయకులు పి.విజయకుమారి, కే లక్ష్మి, కే.దమయంతి, ఏ.శ్రీదేవి, బి.మహలక్ష్మీ, ఎస్.అరుణ్‌కుమారి పాల్గొన్నారు.

దేవరపల్లి: అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించే వరకు పోరాటం ఆపేది లేదని సీఐటీయూ మండల కార్యదర్శి ఎస్.భగత్, అంగన్‌వాడీ నియోజకవర్గ నాయకురాలు టీపీ లక్ష్మి అన్నారు. దేవరపల్లిలో అంగన్‌వాడీల సమ్మె బుధవారానికి 30వరోజుకు చేరుకోవడంతో 30అనే అంకెలలో అంగన్‌వాడీలు నిరసన తెలిపారు. లక్ష్మి మాట్లాడుతూ ప్రభుత్వం షోకాజ్ నోటీసులకు భయపడేదిలేదని ఎస్మాచట్టం పేరుతో సమ్మె నిషేదించటం ఈ ప్రభుత్వానికి చెల్లదని అన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ, అంగన్వాడీ నాయకులు రత్నాజీ, కుమారిఇ, పద్మకామేశ్వరి, వరలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

గోపాలపురం: అంగన్‌వాడీలు చేపట్టిన సమ్మె బుధవారానికి 30వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా 30వ రోజులు సమ్మె పూర్తయిన సందర్భంగా 30 అంకె ఆకారంలో కూర్చుని నిరసన వ్యక్తం చేశారు. అంగన్‌వాడీలు, కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.

కొలతలు లేకుండా పనిని ఎలా పూర్తిచేస్తారు

ఎన్‌ఆర్‌ఈజీఎస్ సామాజిక తనిఖీలో డ్వామా పీడీ జగదాంబ

కొవ్వూరు, జనవరి 10 : ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులతో చేపట్టిన పనులలో డివియేషన్స్ గుర్తించి సంబంధిత సిబ్బందిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని డ్వామా పీడీ పి.జగదాంబ తెలిపారు. కొవ్వూరు మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి పథకంలో చేపట్టిన పనులకు సంబంధించి సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించారు. డ్వామా పీడీ పి.జగదాంబ మాట్లాడుతూ పని చేపట్టే ముందు కొలత లేకుండా పనిని ఎలా పూర్తిచేస్తారని ఫీల్డ్ అసిస్టెంట్‌లను నిలదీశారు. ఎన్‌ఆర్‌ఈజీఎస్ పథకాన్ని నీరుగారుస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పనిలేని రోజులలో 100 పనిదినాలను కల్పిస్తూ గ్రామాలలో మౌలిక వసతులు కల్పిస్తామన్నారు. ఆ పనులలో నాణ్యతా ప్రమాణాలు పాటించారా, లేదా, పేమెంటు సక్రమంగా అందించారా అనే అంశాలను ప్రజావేదికలో పరిశీలిస్తామన్నారు. ఈ తనిఖీలో డివియేషన్స్ గుర్తించి సంబంధిత సిబ్బందిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. వేసవిలో నీటి ఎద్దడిని ఎదుర్కోవడానికి గ్రామాలలో ఫామ్ పాండ్స్, సరోవర్ ఫాండ్స్, క్యాటిల్ షెడ్స్ పనులను గుర్తించి వారంరోజులలో పరిపాలన ఆమోదం పొందాలన్నారు. ఈ తనిఖీలో 2022 ఏప్రిల్ 1వ తేదీ నుంచి 2023 మార్చి 31 వరకు జరిగిన 1586 పనులు చేపడతామన్నారు. ప్రధానంగా జరిగిన పనులకు సంబంధించి రికార్డులు సక్రమంగా నమోదు చేయకపోవడం, సంతకాలు, వేలిముద్రలు సేకరించక పోవడం గుర్తించామన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో కె.సుశీల, డీఆర్‌డీఏ డీపీఎం డి.వి.మాలతి, హెచ్‌ఆర్ మేనేజర్ డి.నరేష్, ఎస్ఆర్‌పీ బి.తులసీనాయక్, ఏపీడీ పి.ఎస్. అప్పలరాజు పాల్గొన్నారు.



ఎన్‌ఆర్‌ఈజీఎస్ సామాజిక తనిఖీ నిర్వహిస్తున్న డ్వామా పీడీ జగదాంబ

అయోధ్య రామమందిరం ప్రారంభోత్సవానికి

హోంమంత్రి వనితకు ఆహ్వానం


అయోధ్య రామమందిరం ప్రారంభోత్సవానికి హోంమంత్రి తానేటి వనితకు ఆహ్వానం అందజేస్తున్న పండితులు

కొవ్వూరు, జనవరి 10 : అయోధ్య నుంచి వచ్చిన శ్రీరాముని అక్షింతలు, ఆహ్వానపత్రికను హోంమంత్రి తానేటి వనితకు అందజేశారు. బుధవారం కొవ్వూరు క్యాంపు కార్యాలయంలో టి.ఎస్వీ రమణమూర్తి ఆధ్వర్యంలో ఆంధ్రగీర్వాణ విద్యాపీఠం బృందం మంత్రిని కలిసి రామమందిరం ప్రారంభోత్సవానికి ఆహ్వానం అందించారు. మంత్రి వనితకు శేషవస్త్రంతో సత్కరించారు. మంత్రి వనిత మాట్లాడుతూ ఈనెల 22న అయోధ్య శ్రీరామ మందిర ప్రారంభోత్సవానికి అహ్వానం అందడం చాలా సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో రామా సొసైటీ అధ్యక్షుడు అక్షయపాత్ర శ్రీనివాస రవీంద్ర, తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య సురక్షాతో ప్రజల చెంతకే వైద్యం


కొవ్వూరు 2వ సచివాలయం ఆరోగ్య సురక్షాలో మందులు పంపిణీ చేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ బావన రత్నకుమారి

కొవ్వూరు, జనవరి 10: ఆరోగ్య సురక్షా ద్వారా ప్రజల చెంతకే వైద్యాన్ని అందిస్తున్నామని కొవ్వూరు మున్సిపల్ చైర్‌పర్సన్ బావన రత్నకుమారి అన్నారు. కొవ్వూరు పట్టణంలోని క్రిస్టియన్‌పేట 2వ సచివాలయం పరిధిలో బుధవారం యూహెచ్‌సీలో ఆరోగ్య సురక్షా కార్యక్రమాన్ని చైర్‌పర్సన్ రత్నకుమారి ప్రారంభించారు. ఈ శిబిరంలో గైనకాలజిస్టులు, పిల్లలు, జనరల్ మెడిసిన్ వైద్యులు 471 మంది రోగులను పరీక్షించి, మందులు పంపిణీ చేశారు. బీపీ, షుగర్, కంటి పరీక్షలు నిర్వహించారు. కౌన్సిలర్ కంటమణి రమేష్ బాబు, మున్సిపల్ కమిషనర్ బి.శ్రీకాంత్, యుహెచ్‌సీ వైద్యులు టి.సుష్మ, పార్వతి, స్వాగత్, మున్సిపల్ ఏఈలు కె.సుమంత్, వెంకటలక్ష్మి, ఆర్ఐ డి.శ్యాంసుందర్, ఆప్తామెట్రిసియన్ టి.ఆనంద్, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

రహదారిపైనే ప్రవహిస్తున్న మురుగు నీరు



తాళ్లపూడి, జనవరి 10 :మండలంలోని గజ్జరం గ్రామంలోని కొత్తకాలనీ వద్ద రహదారిపైనే మురుగు నీరు ప్రవహిస్తోంది. ప్రజలు, స్కూలు పిల్లలు సైతం ఈ మురుగు నీటిలోనే ప్రయాణించాలి. ఈ డ్రైనేజీ విషయం పై పలుమార్లు కాలనీ వాసులు అధి కారులకు, నాయకులకు మొరపెట్టుకు న్నారు. ఇటీవల కాలనీలో కొన్ని డ్రైన్‌పనులు చేసినప్పటికీ ఈ సమస్యపై స్పందించక పోవడం విశేషం. అధికారులు ఈ సమస్యపై స్పందించాల్సిన అవసరం ఉంది.

నీళ్లు ఇవ్వండి మహా ప్రభో

● పట్టణంలో వారం రోజులుగా మంచినీళ్లు రాక ఇక్కట్లు
● అధికారులు, ప్రజా ప్రతినిధుల మధ్య సమన్వయ లోపమే కారణమా?



నిడదవోలు -యర్నగూడెం రోడ్డులో తాగునీటి పైపులైను మరమ్మతుల దృశ్యం

నిడదవోలు, జనవరి 10: కొత్త సంవత్సరం అందులోను పండుగ ముందు రోజులు చుట్టాలు బంధువులు వస్తున్న వేళ పురపాలక సంఘ అధికార్లు పట్టణ ప్రజలకు మంచి షాక్ ఇచ్చారు. గత వారం రోజులుగా మున్సిపల్ కుళాయిల ద్వారా మంచినీళ్ల రాక ప్రజలంతా ఇబ్బంది పడేలా మంచినీటి పైపులైన్ల మార్పిడి ప్రారంభించారు. ఆ పనులు కాస్త విఫలం కావడంతో పట్టణ ప్రజలంతా వేసవి రాకుండానే మంచినీటికి తీవ్ర ఎద్దడిని ఎదుర్కొంటూ ఇదేం ప్రభుత్వంరా బాబూ అంటూ తలలు బాదుకొంటున్నారు. వివారాల్లోకి వెళితే నిడదవోలు పురపాలక సంఘ పరిధిలో గణపతి సెంటర్ వద్ద గత వారం రోజుల క్రితం మున్సిపల్ మంచినీటి కుళాయిలకు మంచినీటి సరఫరా జరిగే భూగర్భ పైపులైన్లు మార్చే పని ప్రారంభించారు. ఇవే పనులు 2022లో సుమారు 40 లక్షల రూపాయల నిధులతో పనులు చేసేందుకు కాంట్రాక్టరుకు వర్క్ ఆర్డర్ ఇచ్చారు. అప్పుడే కాంట్రాక్టర్ కొంత శాతం పనులు పూర్తిచేసి ఉంచాడు. గత కొద్ది నెలల క్రితం గణపతి సెంటరులో ఉన్న మున్సిపల్ స్థలంలో ఉన్న అక్రమ నిర్మాణాలను తొలగించారు. దీంతో స్థానిక ప్రజా ప్రతినిధులు అధికార్లపై ఒత్తిడి తేవడంతో పండుగ రోజులనే విషయం మరచి మిగిలిన పైపు లైను వేసే పనిని ప్రారంభించారు. ఆ పైపులైన్ల మధ్య లీకేజ్ సమస్య తలెత్తడంతో సమస్యను పరిష్కరించడంలో గత వారంరోజులుగా మున్సిపల్ అధికార్లు విఫలమయ్యారు. దీనికారణంగా పట్టణంలో పలు ప్రాంతాల్లో గతవారం రోజులుగా మంచినీటి సరఫరా లేక పోవడంతో పట్టణంలో మంచినీటి సమస్య తలెత్తింది. ఇటు మున్సిపల్ ప్రజా ప్రతినిధులు కాని, మున్సిపల్ అధికార్లు కాని ఎటువంటి మైక్ అనౌన్స్‌మెంటు లేకుండా వాటర్ ట్యాంకును తిప్పినప్పటికీ ప్రజలకు తాగునీరు అందక నానా అవస్థలు పడుతున్నారు. పండుగరోజుల్లో ఈ వైసీపీ ప్రభుత్వం అనాలోచిత నిర్ణయం కారణంగా పట్టణ నడిబొడ్డులో ఉన్నవారికే గత వారం రోజులుగా తాగునీరు లేక నానా అవస్థలు పడుతున్నా ప్రజా ప్రతినిధులకు చీమకుట్టినట్టయినా లేదని ప్రజలు బహిరంగంగా విమర్శిస్తున్నారు. బుధవారం దీనిపై మున్సిపల్ కమిషనర్ కేవీ పద్మావతి మాట్లాడుతూ బుధవారం సాయంత్రం నాటికి మున్సిపల్ కుళాయిల ద్వారా తాగునీటిని పునరుద్ధరిస్తున్నామని తెలిపారు. లీకేజ్ సమస్యను పరిష్కరించేందుకు ఇంజనీరింగ్ అధికార్లు లీకేజ్ ఉన్నచోట కాంక్రీటుతో లీకేజ్ సమస్యను పరిష్కరించేందుకు సమాయత్తమవుతున్నారని అన్నారు.

లీకేజీ సమస్య పరిష్కరిస్తాం : మున్సిపల్ డీఈ మాధవి



మున్సిపల్ డీ మాధవి మాట్లాడుతూ కాంక్రీట్‌తో లీకేజ్ సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తున్నాం. మరొక రోజుపాటు నీటి సరఫరా జరిగే అవకాశం కనిపించడంలేదన్నారు. ప్రజలు తాగునీరులేక ఇబ్బందులు పడు తున్నారని ఆమె దృష్టికి తీసుకువెళ్లగా ఆమె నుంచి ఎటువంటి స్పందన లేదు.

రైతులకు ప్రతినెలా రూ.10 వేలు పెన్షన్ ఇవ్వాలి

● నూతన కమిటీ ఏర్పాటు ● 35 తీర్మానాలకు సభ ఆమోదం
● ముగిసిన ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం మహాసభలు

రాజమహేంద్రవరం అర్బన్, జనవరి 10 : రైతులకు ప్రతినెలా రూ.10 వేలు పెన్షన్ ఇవ్వాలని రైతులకు ఏదైనా సమస్య వస్తే రైతులందరూ ఏకమై ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలని, రైతులకు వ్యతిరేకంగా ఏదైనా చట్టాలు తీసుకొస్తే ఊరుకునేదిలేదని ప్రభుత్వాన్ని రైతు సంఘం తరపున ప్రభుత్వాన్ని హెచ్చరించారు. రాజమహేంద్రవరంలో మూడురోజులపాటు జరిగిన ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర మహాసభలు బుధవారంతో ముగిశాయి. 35 తీర్మానాలను సభ ఆమోదించింది. ఈ సందర్భంగా నూతన కమిటీని ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షుడిగా పి.రామచంద్రయ్య, అధ్యక్షుడిగా జి.ఈశ్వరయ్య, వర్కింగ్ ప్రశిడెంట్‌గా ఏ.కాటమయ్య, ప్రధాన కార్యదర్శిగా కేవీవీ ప్రసాద్, కార్యదర్శి, కోశాధికారిగా వలవలపూడి రాములను ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షులుగా ఏ రామానాయుడు, వి.హనుమారెడ్డి, ఎం.యల్లమందరావు, కార్యవర్గసభ్యులుగా డేగా ప్రభాకర్, కె.జగన్నాథం, వి.జమలయ్య, సి.మల్లికార్జున, బుడితి అప్పలనాయుడులతో కూడిన 21 మంది కార్యవర్గం, 58 మందితో సమితిని ఎన్నుకున్నారు. పలు తీర్మానాలు చేశారు. భూ యాజమాన్య హక్కుల చట్టం 2023ను రద్దు చేయాలని, కౌలు రైతుల చట్టాన్ని సవరించి సులభంగా కౌలు రైతులకు గుర్తింపు కార్డులు జారీ చేయాలని, రైతుల ఆత్మహత్యలు అరికట్టే రుణ ఉపశమన చట్టాన్ని తీసుకురావాలని సాగునీటి ప్రాజెక్టులు త్వరగా పూర్తి చేయాలని, పోలవరం ముంపు ప్రజలను ఆదుకోవాలని, ఆక్వా రైతులకు రాయితీలు ఇవ్వాలని తదితర తీర్మానాలు చేశారు.

చెత్తకుప్పల్లో దర్శనమిస్తున్న

జగనన్న సంపూర్ణ ఆరోగ్య ప్యాకెట్లు

గోపాలపురం, జనవరి 10: మాతా శిశు మరణాలు అరికట్టేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయంతో అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భవతులకు, బాలింతలకు పంపిణీ చేస్తున్న జగనన్న సంపూర్ణ పోషణ పథకం పేరుతో అందజేస్తున్న రాగి, జొన్నపిండి ప్యాకెట్లు బుధవారం గోపాలపురంలో చెత్తకుప్పల్లో దర్శనమిచ్చాయి. ప్రస్తుతం అంగన్‌వాడీలు సమ్మె ప్రారంభించి నెలరోజులు పూర్తవుతున్న తరుణంలో కాలం చెల్లిన ఆ ప్యాకెట్లను చెత్తకుప్పల్లో విసిరేశారో ఆ ప్యాకెట్లు తీసుకున్న ఉపయోగం లేదనుకున్నారో మొత్తానికి జగనన్న సంపూర్ణపోషణ పథకంలో భాగంగా అంగన్‌వాడీల ద్వారా గర్భవతులకు, బాలింతలకు అందజేస్తున్న రాగిసంకటి, జొన్నపిండి ప్యాకెట్లు ఇలా చెత్త కుప్పల్లో దర్శనమిస్తూ ఆంధ్రజ్యోతికి చిక్కాయి.


గోపాలపురంలో చెత్తకుప్పల్లో దర్శనమిస్తున్న జగనన్న సంపూర్ణఆరోగ్య రాగి, జొన్న పిండి ప్యాకెట్లు

సినిమా గైడ్

కొవ్వూరు	
యువరాజ్‌మాల్ వై.స్క్రీన్ 1	డెవిల్
వై.స్క్రీన్2	సలార్
దేవిశ్రీ(గాయత్రి)	హాయ్ నాన్న
అనన్య	సలార్
నిడదవోలు	
వీ మ్యాక్స్	డెవిల్
రాధాకృష్ణ	హాయ్ నాన్న
శ్రీగణపతి	సలార్
దేవరపల్లి	
శ్రీరామ్ సినీ మ్యాక్స్	సలార్
శ్రీరామ్ సినీ మ్యాక్స్	సలార్
నల్లజర్ల	
శ్రీలక్ష్మి మల్టీప్లెక్స్	సలార్
శ్రీనివాస	సలార్